www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO. APTEL/2010/33229




సంపుటి : 16 | సంచిక :114 | గురువారం 05.06.2025 | ఎడిటర్ :కొమరాజు శ్రీనివాసులు | పేజీలు :08 | వెల : రూ 2/-

# ఆర్సీబి విజయ-విషాదం..

## తొక్కిసలాటలో 11 మంది మృతి, 37 మందికి గాయాలు..

- ఆర్సీబీ విజయోత్సవాల్లో పెను విషాదం..
- బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో తొక్కిసలాట..
- ఆర్సీబి విజయోత్సవ వేడుకల్లో విషాదం..
- పోలీసుల లాఠీ ఛార్జ్.
- అభిమానుల మధ్య తొక్కిసలాట.
- బెంగళూరు తొక్కిసలాటపై కాంగ్రెస్ పై బీజేపీ ఫైర్..
- సీఎం, డిప్యూటీ సీఎం హగ్స్, ఫోటోల్లో బిజీగా ఉన్నారు: బీజేపీ నేత మాల్వీయా

02

సీఎం, డిప్యూటీ సీఎం హగ్స్, ఫోటోల్లో బిజీగా ఉన్నారు:బీజేపీ నేత మాల్వీయా

తొక్కిసలాట జరిగిన తర్వాత కన్నీళ్లు పెట్టిస్తున్న దృశ్యాలు..



# కవితకు తెలంగాణ పౌరుషం లేదు..

## కవిత స్టేట్మెంట్ ఇచ్చే ముందు స్థాయి చూసుకోవాలి

- మాలాంటి వారికి తెలంగాణ వాదం నేర్పించింది బీజేపీ
- మాకు కాకుండా ఇంకెవరికి తెలంగాణ పౌరుషం ఉంటది
- మాది హిందుగాళ్లు బొందు గాళ్ళు అన్న రక్తం కాదు
- కవితపై బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

03

కేసీఆర్ ఏ కాలేజీలో చదివారు.. ఎక్కడ సివిల్ ఇంజనీరింగ్ చేశారు? ఎన్ని ప్రాజెక్ట్ లు చేశారు?




# కూకట్‌పల్లి డ్రగ్స్ కేసు..



- కూకట్‌పల్లి డ్రగ్స్ కేసులో కీలక నిందితుడు
- కానిస్టేబుల్ గుణశేఖర్ గుణశేఖర్‌ను పట్టుకు నేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు.

06

# జీహెచ్ఎంసీ బార్లకు దరఖాస్తుల వెల్లువ



- జీహెచ్ఎంసీ పరిధిలో 24 బార్లకు ఇప్పటికీ 356 దరఖాస్తులు
- రూరల్ బార్ల కంటే జీహెచ్ఎంసీలో ఎక్కువ స్పందన
- ఈ నెల 6వ తేదీ వరకు దర ఖాస్తులకు చివరి గడువు

06

# అర్హులందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇండ్లు

- ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ పథకాల అమలు
- ఖమ్మంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- లబ్దిదారులకు ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ

గత సర్కారు పేదలపై శ్రద్ధ పెట్టలే నేడు అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



06

**ఖమ్మం, ఫ్లాష్ ఇండియా:**

గత పాలకులు ఎమ్మెల్యే నివాసాలు, ప్రభుత్వ భవనాల మీద పెట్టిన శ్రద్ధ పేద ప్రజల ఇళ్లపై పెట్టలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. కానీ తమ ప్రజా ప్రభుత్వం రూ. 22,500 కోట్లను పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చడం కోసం కేటాయించిందని తెలిపారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ పేదల సంక్షేమమే ఎజెండాగా పాలన కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. అర్హులైన నిరుపే దలందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, ఇది నిరంతర ప్రక్రియ అని అన్నారు. ఖమ్మం జిల్లాలోని టీసీవీ రెడ్డి ఫంక్షన్ హాల్లో ఇవాళ జరిగిన కార్మక మంలో లబ్దిదారులకు మంత్రి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. లబ్దిదారుల ముఖాలలో ఆనందం చూస్తుంటే తాను భావోద్వేగానికి లోనయ్యానని పేర్కొన్నారు. ప్రజలకుఉపయోగపడే పని చేస్తే వారి నుంచి వచ్చే స్పందన అద్భుతంగా ఉంటుందని అన్నారు.

# రాజకీయ దురుద్దేశంతోనే కేసీఆర్‌కు నోటీసులు

## మేఘాకు ఎందుకు నోటీసు ఇవ్వలే?

- ఇందిరా పార్క్ వద్ద కవిత నేతృత్వంలో తెలంగాణ జాగృతి మహాధర్నా
- కేసీఆర్‌కు నోటీసులపై కాంగ్రెస్‌పై ఘాటు విమర్శలు
- తెలంగాణ హక్కుల కోసం కేంద్రాన్ని డిమాండ్ చేసిన ఎమ్మెల్సీ కవిత

20 పంప్ హౌస్లు కట్టిన కృష్ణారెడ్డినీ పిలువ్

ఆయనను పిలిచే దమ్ములేదా రేవంత్ రెడ్డీ



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** 03

**బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోలేరా?...**

గోదావరి నుంచి 200 టీఎంసీల నీళ్లను బనకచర్ల ప్రాజెక్టుకు ఎత్తుకుపోతానని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కాలర్ ఎగరేసి చెబుతుంటే దీన్ని అడ్డుకునేలా లేఖ రాయడానికి సీఎం రేవంత్ రెడ్డికి ఎందుకు ధైర్యం రావడం లేదని కవిత ప్రశ్నించారు. అఫెక్స్ కౌన్సిల్ మీటింగ్ పెట్టమని ఎందుకు అడగడం లేదన్నారు. బన కచర్లను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. తుపాకుల గూడెం వద్దే లింకేజ్ పాయింట్ ఉండాలని తక్షణమే కేంద్ర ప్రభుత్వానికి సీఎం లేఖ రాయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబుపై ఆధారపడే కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందని అందువల్లే చంద్రబాబు తెలంగాణ జల దోపిడీ చేస్తున్నా కిషన్రెడ్డి, బండి సంజయ్ ఒక్క మాట మాట్లాడటం లేదన్నారు. బీజేపీలో ఈటల రాజేందర్ అన్న ఒక్కరే తెలంగాణ బిడ్డ అని, ఆయన సైతం మాట్లాడం లేదన్నారు. గోదావరి, పెన్నా లింకేజ్ పాయింట్ తుపాకుల గూడెం వద్ద నుంచే ఉండేలా ఈటల రాజేందర్ బాధ్యతలు తీసుకోవాల న్నారు. దీనిపై తెలంగాణ జాగృతి తరఫున కార్యాచరణ తీసుకుంటామన్నారు.

# ట్రంప్ సర్కార్‌పై మస్క్ వ్యతిరేక గళం



- ట్రంప్ సర్కార్‌పై మస్క్ వ్యతిరేక గళం
- ట్యాక్స్ బిల్లుపై విమర్శలు ట్రంప్ నిర్ణయంలో మార్పు ఉందన్న వైట్‌హౌస్

05

# ఇథనాల్ ఫ్యాక్టరీపై వ్యతిరేకత..



- కదం తొక్కిన 10 గ్రామాల ప్రజలు
- భారీగా తరలివచ్చిన మహిళలు
- పలు వాహనాలు, టెంట్లకు నిప్పు

06

**అడ్డుకున్న పోలీసులు..**

విషయం తెలుసుకున్న పోలీసులు వారిని అడ్డుకోవ డంతో ఆగ్రహం వ్యక్తం చేసిన మహిళలు ఒక్కసారిగా అక్కడ ఉన్న వాహనాలకు, టెంట్లకు నిప్పు అంటించారు. వందలాది మహిళలు ఒక్కసారిగా ఆందోళనకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. నారాయణపేట జిల్లా మరికల్లోనూ పెద్దఎత్తున ఆందోళనలు జరుగు తుండగానే..

# రంగంలోకి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి

## ఆయన్ను తక్షణమే తొలగించండి.. ఎర్రగడ్డ ఆస్పత్రి ఘటనపై



- నిన్న ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో ఫుడ్ పాయిజన్ ఘటన
- ఎర్రగడ్డ మానసిక వైద్యశాలను సందర్శించిన ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- డైయిట్ కారణంగానే ఈ ఫుడ్ పాయిజాన్ జరిగినట్టు తెలుస్తోంది : మంత్రి దామోదర

05


**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :**

తెలంగాణ అవతరణ దినోత్సవం రోజు ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో చోటుచే సుకున్న ఫుడ్ పాయిజన్ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. జూన్ 2న జరిగిన ఈ ఘటనపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నరసింహ స్పందించారు. మొత్తం 92 మంది రోగులు అస్వస్థతకు గురవగా, వారిలో 18 మందిని తీవ్రంగా ఉండటంతో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారిని గాంధీ ఆసుపత్రి, ఉస్మానియా సహా ఇతర ఆసుపత్రుల్లో ఏర్పాటు చేసిన ఆరు వైద్య బృందాలు పర్యవేక్షిస్తున్నాయి.ఈ ఘటనపై మంత్రి

# కారు గెలిచాడు కానీ

- ఐపీఎల్ 2025 సూపర్ స్ట్రైకర్ అఫ్ ది సీజన్ గా వైభవ్ సూర్యవంశీ
- బహుమతిగా అందుకున్న కారు.
- వైభవ్ సూర్యవంశీ ప్రస్తుత వయసు 14 ఏళ్లు మాత్రమే.
- కారు నడపాలంటే మరో నాలుగేళ్లు ఆగాల్సిందే.

07



# ఇంటర్ బోర్డు కీలక ప్రకటన...

- పాఠ్య పుస్తకాల ముద్రణ, పంపిణీ కార్యక్రమం ప్రారంభం
- మొదటి ఏడాది విద్యార్థుల పుస్తకాల ముద్రణ, పంపిణీ ప్రారంభం
- 2025 జూన్ మొదటి వారంలో పంపిణీ పూర్తి అవుతుందని వెల్లడి

06

# కాంగ్రెస్ కి పరిపాలన చేత కావడం లేదు

- కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాలన చేత కావడం లేదు
- ఎర్రగడ్డలో మానసిక రోగులకు అన్నం పెట్టడానికి చేత కావడం లేదు
- 70 మంది అస్వస్థతకు గురైతే సీఎం ఇప్పటివరకు స్పందించలేదు
- వేములవాడలో కోడెల మృత్యువాత పడుతుంటే మీకు సోయి లేదా : హరీష్ రావు

03






# ఇకపై అంగన్వాడీ కేంద్రాల్లో ఎగ్ బిర్యానీ

- పోషకాహార లోపం లేకుండా జాగ్రత్తలు కేంద్రాల్లో
- 57 రకాల ఆటవ స్తువులు ప్లే స్కూల్స్ కు దీటుగా మార్పు
- చిన్నారులకు సీతక్క గుడ్ న్యూస్ సెల్ఫీ విత్ అంగన్వాడి సక్సెస్
- చేయాలి గర్భిణులు, బాలింతల కోసం బెంచీలు సెంటర్లకు అధునాతన మొబైల్స్

03



# సీఎంకి రాజాసింగ్ లేఖ..

- అగ్ని ప్రమాద బాధితుల పట్ల అధికారి అమానవీయ ప్రవర్తన
- అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలని అభ్యర్థిస్తూ లేఖ
- చట్టపరమైన చర్యలు తీసు కోవాలని కోరిన ఎమ్మెల్యే రాజాసింగ్

02




## హైదరాబాద్



| | |
|---|---|
| 22 క్యారెట్ | రూ.90,900 |
| 24 క్యారెట్ | రూ.99,170 |
| కేజీ వెండి | రూ.1,14,500 |

## చికెన్ రేటు



| | |
|---|---|
| Dressed With Skin | 190 Kg |
| Skinless | 220 Kg |
| Boneless | 280 Kg |

# మరో యూట్యూబర్ అరెస్ట్


- జ్యోతి మల్హోత్రాతో సంబంధం ఉన్న మరో యూట్యూబర్ అరెస్ట్
- జస్బీర్ సింగ్‌ను బుధవారం అరెస్ట్ చేసిన నిఘా వర్గాలు



**పంజాబ్ :** పాకిస్థాన్ కు గూఢచర్యం చేస్తూ హర్యానకు చెందిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాను పోలీసులు అరెస్ట్ చేశారు. 9 రోజుల పాటు విచారించి.. అనేక విషయాలు రాబట్టారు. అనంతరం పలువురు యూట్యూబర్లను నిఘా వర్గాలు అరెస్ట్ చేశాయి. తాజాగా జ్యోతి మల్హోత్రాతో సంబంధాలు ఉన్న జస్బీర్ సింగ్ ను బుధవారం నిఘా వర్గాలు అరెస్ట్ చేశాయి.జస్బీర్ సింగ్ 'జాన్ మహల్' అనే యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తున్నాడు. ఇతనికి 1.1 మిలియన్లకు పైగా సబ్ స్కైబర్లు ఉన్నారు. జ్యోతి మల్హోత్రాతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. పాకిస్థాన్ మద్దతుతో ఇతడు గూఢచర్యం చేసినట్లుగా పంజాబ్ పోలీసులు గుర్తించి అరెస్ట్ చేశారు. పాకిస్థాన్ ఐఎస్ఐ కార్యకర్త షకీర్ తో సన్నిహిత సంబంధాలు ఉన్నట్లుగా గుర్తించారు. జస్బీర్ సింగ్.. పాకిస్థాన్ జాతీయ దినోత్సవ కార్యక్రమానికి కూడా హాజరయ్యాడు. ఇప్పటికే పాకిస్థాన్ కు మూడు సార్లు వెళ్లి వచ్చినట్లుగా ఆధారాలు సేకరించారు. పాకిస్థాన్ అధికారి డానిష్ తో కూడా సంబంధాలు ఉన్నట్లుగా గుర్తించారు.డానిష్ ఆహ్వానం మేరకు ఢిల్లీలోని పాకిస్థాన్ రాయబార కార్యాలయంలో జరిగిన పాకిస్థాన్ జాతీయ దినోత్సవ వేడుకలకు సింగ్ హాజరయ్యారని.. అక్కడ పాకిస్థాన్ ఆర్మీ సిబ్బంది, వ్లాగర్లతో సంభాషించినట్లుగా అధికారులు తెలిపారు. 2020, 2021, 2024లో మూడుసార్లు సింగ్ పాకిస్థాన్ కు వెళ్లి వచ్చినట్లుగా కనిపెట్టారు.పంజాబ్ లోని రూప్ నగర్ జిల్లాలోని మహ్లాన్ గ్రామానికి చెందిన జస్బీర్ సింగ్ ను మోహాలీలోని స్టేట్ స్పెషల్ ఆపరేషన్స్ సెల్ అరెస్ట్ చేసింది. నిఘా వర్గాల సమాచారం మేరకు అదుపులోకి తీసుకున్నారు. జ్యోతి మల్హోత్రాతో సింగ్ కు స్పష్టమైన సంబంధాలు ఉన్నట్లుగా గుర్తించిన తర్వాతే ఈ అరెస్ట్ చేసుకున్నట్లు సమాచారం.జ్యోతి మల్హోత్రా తర్వాత సింగ్ కే పాకిస్థాన్ ఐఎస్ఐతో సంబంధాలు ఉన్నట్లుగా గుర్తించారు. మొబైల్ లో వారికి సంబంధించి కాంటాక్ట్ నెంబర్లు ఉండడం కూడా సేకరించారు. ఇలా గూఢచర్యం చేసిన వాళ్లందరినీ గుర్తించే పనిలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇప్పటివరకు పాకిస్థాన్ తరపున గూఢచర్యం చేస్తున్నారనే ఆరోపణలతో పంజాబ్ పోలీసులు ఏడుగురిని అరెస్టు చేశారు

# హడలెత్తిస్తున్న కోవిడ్..

## ప్రస్తుతం 4,302కు చేరిన కేసులు




**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** దేశంలో కరోనా విజృంభిస్తోంది. గత వారం కంటే ఈ వారం వేగంగా కేసులు పెరిగి పోతున్నాయి. గత 24 గంటల్లో ఐదుగురు చనిపోయారు. కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ లో ఒక్కొక్కరు చనిపోగా.. మహారాష్ట్రలో ఇద్దరు చనిపోయారు. ఇక దేశ వ్యాప్తంగా 4, 302 కేసులు నమోదైనట్లు ఆరోగ్య శాఖ తెలిపింది.మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో కరోనాపై సంరక్షక మంత్రి గణేష్ నాయక్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కోవిడ్ మరణాల పెరగడంతో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. గత 24 గంటల్లో దాదాపు 300 కొత్త ఇన్ఫెక్షన్లు నమోదయ్యాయని ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పేర్కొంది. కేరళలో రోజువారీ కేసులు అత్యధికంగా నమోదవుతూనే ఉన్నాయని తెలిపింది.

**రాష్ట్రాల వారీగా కేసులు..**

గుజరాత్ లో మంగళవారం 108 కొత్త కేసులు నమోదు కాగా.. ఒకరు చనిపోయారు. దీంతో రాష్ట్రంలో యాక్టివ్ కేసుల సంఖ్య 461కి చేరుకుందని రాష్ట్ర ఆరోగ్య శాఖ తెలిపింది.మహారాష్ట్రలో 86 కొత్త కేసులు నమోదు కాగా.. నలుగురు చనిపోయారు. యాక్టివ్ ఇన్ఫెక్షన్ల సంఖ్య 510కి పెరిగింది. నాగ్ పూర్, చంద్రపూర్, మిరాజ్ వంటి జిల్లాల్లో మరణాలు నమోదయ్యాయి.దేశంలో అత్యధికంగా 1,446 యాక్టివ్ కేసులతో కేరళ అగ్రస్థానంలో కొనసాగుతోంది. తర్వాత మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ (393) కేసులు ఉన్నాయి.పశ్చిమ బెంగాల్ లో 41 కొత్త ఇన్ ఫెక్షన్లు, కోల్ కతాలో ఒక మరణం చోటుచేసుకుంది. కోమోర్బిడిటీలతో బాధపడుతున్న 43 ఏళ్ల మహిళ చికిత్స పొందుతూ మరణించింది.హర్యానాలో 16 కొత్త కేసులు నమోదయ్యాయి. గురుగ్రామ్, ఫరీదాబాద్ లో ఎక్కువ ఉన్నాయి. రాష్ట్రంలో ఇప్పుడు యాక్టివ్ కేసులు 51గా ఉన్నాయి.

గత మూడు వారాల్లో ఆంధ్రప్రదేశ్ లో 38 కేసులు నమోదయ్యాయి. మధ్యప్రదేశ్ లోని ఇండోర్ లో రెండు కొత్త కేసులు నమోదయ్యాయి.గ్వాలియర్ మరియు హిమాచల్ ప్రదేశ్ లోని సిర్మౌర్ జిల్లాలలో కూడా కొత్త కేసులు నమోదయ్యాయి.

రాష్ట్రాలకు ఆరోగ్య శాఖ పలు సూచనలు ప్రతి తాలూకాలో కోవిడ్ సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలిబహిరంగ ప్రదేశాలు, తినుబండారాల క్రిమిసంహారక చర్య చేపట్టాలిపాఠశాలల్లో పారిశుధ్యాన్ని పాటించాలిపరిశుభ్రత, చేతులు కడుక్కోవడం, శానిటైజర్ల వాడకంపై సలహాలు ఇవ్వాలి

# తెలంగాణ కాంగ్రెస్ నేత మధుయాష్కీ గౌడ్ కీలక ప్రకటన

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై కాంగ్రెస్ నేత మధుయాష్కీ గౌడ్ తీవ్ర విమర్శలు చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టులో చోటుచేసుకున్న అవకతవకలపై న్యాయబద్ధంగా విచారణ జరగాలని కమిషన్ వేశారు. కమిషన్ అధికారులు ఇచ్చిన ఆధారాలతోనే అప్పటి సీఎం కేసీఆర్ కు, ఇరిగేషన్ మంత్రి హరీష్ రావుకు, ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ కు నోటీసులు ఇచ్చారు. అసలు



డ్యామ్ కు, టన్నెల్ కు తేడా ఏంటో కవితకు తెలుసా? అని మధుయాష్కీ ప్రశ్నించారు. కాళేశ్వరం పేరుతో కేసీఆర్ కుటుంబం సర్వం దోచుకుందని ఆరోపించారు. కేసీఆర్, హరీష్ రావు జైలుకు వెళ్లడం ఖాయమని జోస్యం చెప్పారు. తెలంగాణ బిల్లు ఆమోదం కోసం చేసిన పోరాటంపై డాక్యుమెంటరీ తయారు చేస్తున్నామని కీలక ప్రకటన చేశారు.అంతకుముందు కేసీఆర్ కు కాళేశ్వరం కమిషన్ నోటీసులను నిరసిస్తూ ఇందిరా పార్క్ వద్ద తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కవిత ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. కేసీఆర్ ఏం తప్పు చేశారని నోటీసులు ఇచ్చారని ప్రశ్నించారు. ఆయనకు ఇచ్చారంటే మొత్తం తెలంగాణకు ఇచ్చినట్లే అని అన్నారు. తెలంగాణ భూములకు నీళ్లు ఇవ్వడమే కేసీఆర్ చేసిన తప్పా అని నిలదీశారు. అది కాళేశ్వరం కమిషన్ కాదు.. అది కాంగ్రెస్ కమిషన్ , రాజకీయ కమిషన్ అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం పూర్తయితే 35 శాతం తెలంగాణ భూభాగానికి నీళ్లు అందిస్తుంది. కేసీఆర్ ది గట్టి గుండె కాబట్టి అంత పెద్ద ప్రాజెక్టు నిర్మించారు. దీనిని కాంగ్రెస్ నేతలు ఓర్వలేక పోతున్నారని అన్నారు.

# సీఎంకి రాజాసింగ్ లేఖ..

- అగ్ని ప్రమాద బాధితుల పట్ల అధికారి అమానవీయ ప్రవర్తన
- అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలని అభ్యర్థిస్తూ లేఖ
- చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరిన ఎమ్మెల్యే రాజాసింగ్



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** గుల్జార్ హౌస్ అగ్ని ప్రమాద బాధితుల పట్ల విద్యుత్ శాఖ అధికారి అమానవీయ ప్రవర్తనపై బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ స్పందించారు. సంబంధిత అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలని అభ్యర్థిస్తూ సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. లేఖలో ఇలా రాసుకొచ్చారు. చార్మినార్ లోని గుల్జార్ హౌస్ లో జరిగిన వినాశకరమైన అగ్నిప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన 17 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ సంఘటన మన నగరాన్ని కలచివేసింది. మృతుల కుటుంబానికి ఊహించలేని దుఃఖాన్ని కలిగించింది. బాధితులకు పరిపాలన సాధ్యమైనంత మద్దతు అందించాల్సిన సమయంలో విద్యుత్ శాఖకు చెందిన ఓ అధికారి వారిపట్ల అసభ్యకరంగా, అనైతికంగా వ్యవహరించాడు.ఆ అధికారి ఇప్పటికే పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబం నుంచి ₹2.5 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశాడు. అంతే కాకుండా.. ఇంట్లోని ఓ మహిళా సభ్యురాలి పట్ల అభ్యంతరకరమైన భాషను కూడా ఉపయోగించారు. ఆ అధికారి ఆమె ఫోన్ ను లాక్కొని బెదిరింపులకు దిగాడు. ఇప్పటికే బాధలో ఉన్న కుటుంబాన్ని మరింత ఇబ్బంది పెట్టడం దారుణం.. ఇటువంటి ప్రవర్తన ఆమోదయోగ్యం కాదు. ఇది ప్రజా సేవా నైతికతను ఉల్లంఘించడం. ఇలాంటి ఘటనలు ప్రభుత్వ యంత్రాంగానికి చెడ్డపేరు తెస్తాయి. ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. ఈ నేపథ్యంలో పూర్తి దర్యాప్తు జరిగే వరకు సంబంధిత అధికారిని వెంటనే సస్పెండ్ చేయండి..సంఘటనపై ఉన్నత స్థాయి విచారణను ప్రారంభించండి. అధికారిపై చట్టపరమైన, క్రమశిక్షణా చర్యలు తీసుకునేలా చూసుకోండి. బాధిత కుటుంబానికి అవసరమైన రక్షణ, మద్దతు అందించాలని రాజాసింగ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాసిన లేఖలో పేర్కొన్నారు.

# ఇకపై అంగన్వాడీ కేంద్రాల్లో ఎగ్ బిర్యానీ



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** చిన్నారుల్లో పోషకాహార లోపం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అంగన్వాడి కేంద్రాల్లో అందిస్తున్న విద్యను, ఆరోగ్య భద్రతను మెరుగు పరుచుకునే లక్ష్యంతో మనమంతా పనిచేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. అంగన్వాడీల్లో చిన్నారులకు అందిస్తున్న ఆహారపదార్థాలను మరింత రుచికరంగా మారుస్తామని వారంలో ఒకటి రెండు సార్లు ఎగ్ బిర్యానీ వడ్డించేలా మెనూ మార్చబోతున్నట్లు చెప్పారు. ఇవాళ హైదరాబాద్ రాజేంద్రనగర్ లోని తెలంగాణ గ్రామీణ అభివృద్ధి సంస్థలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మేధోమథన సదస్సులో మాట్లాడిన సీతక్క..అంగన్ వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణీలు, బాలింతలు నేల మీద కూర్చోవడానికి ఇబ్బందులు పడుతున్నారని వారి ఇబ్బందులను తొలగించేందుకు అంగన్వాడి కేంద్రాలకు బెంచీలను సరఫరా చేస్తామన్నారు. అంగన్వాడి టీచర్లు ప్రస్తుతం వినియోగిస్తున్న మొబైల్ స్థానంలో అధునాతన మొబైల్స్ ను త్వరలో అందజేస్తామన్నారు.

**బడి గంట తరహాలో బెల్స్:**

అంగన్ వాడీ కేంద్రాల్లోనూ బడి గంట తరహాలో బెల్సును తీసుకురావాలనే ఆలోచనతో ఉన్నామని ఇలా గంటను మోగించడం ద్వారా చిన్నారుల్లో ఉత్సాహం క్రమశిక్షణ పెరుగుతాయని టీచర్లు, హెల్పర్లు సకాలంలో వచ్చేందుకు ఉపయోగపడుతుందన్నారు. మీ అనుభవాలు, ఆలోచనలు, ఎదురవుతున్న సమస్యలు, సవాళ్లను తెలుసుకునేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నామని మీరు వ్యక్తపరిచిన అభిప్రాయాలను క్రోడీకరించి, నిపుణులు మేధావులతో చర్చించి అంగన్వాడీల సేవలను మరింత మెరుగుపరుస్తామన్నారు. మేము అధికారంలోకి వచ్చాక అంగన్వాడీ సమ్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని చెప్పారు. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల పని ఒత్తిడిని తగ్గించేందుకు త్వరలో 14 వేల ఖాళీలను భర్తీ చేస్తామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ కారణంగా నియామకాల ప్రక్రియ కాస్త ఆలస్యమైందని త్వరలో ఆ పోస్టులను భర్తీ చేస్తామన్నారు. అంగన్వాడి కేంద్రాలను అక్షర జ్ఞానానికి, పోషకాహారానికి, ఆరోగ్యానికి, ఆటవిడుపుకు, మేధో వికాసానికి కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ప్లే స్కూల్ లకు దీటుగా అంగన్వాడీలను సిద్ధం చేసి తల్లిదండ్రుల ఆర్థిక భారాన్ని తగ్గిస్తున్నామని అన్నారు. చిన్నారుల చదువు, సౌకర్యం, ఆటవిడుపు కోసం 57 రకాల వస్తువులను అంగన్వాడీలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీలకు నమ్మకం కలిగించేలా సిబ్బంది పని చేయాలని సూచించారు.అంగన్వాడీలు అందుతున్న సేవలను క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలిసేలా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సెల్ఫీ విత్ అంగన్వాడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అంగన్వాడీల్లో అడ్మిషన్లు పెంచేందుకు అమ్మమాట అంగన్వాడి బాట కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. నాసిరకం సరుకులు సరఫరా చేసే సప్లయర్స్ ను బ్లాక్ లిస్టులో పెడుతున్నామని హెచ్చరించారు. కోడిగుడ్ల విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ తరపున వయోవృద్ధులకు, ట్రాన్స్ జెండర్ ల ఆత్మగౌరవాన్నీ పెంపొందించే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కొత్తగా నిర్మిస్తున్న అంగన్వాడీ భవనాలను ఒకే మోడల్ లో నిర్మించాలని సూచించారు

# ఆర్సీబి విజయ-విషాదం..

**బెంగళూరు :** ఐపీఎల్ 18వ సీజన్ విజేతగా రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబి) జట్టు నిలిచిన నేపథ్యంలో బెంగళూరులో ఘనంగా సంబరాలు నిర్వహించడానికి భారీగా ఏర్పాట్లు చేసారు. అయితే ఆ వేడుక కాస్త విషాదం నింపింది. జట్టు సభ్యులు విజయోత్సవం కోసం నగరానికి చేరుకున్న నేపథ్యంలో చిన్నస్వామి స్టేడియకు భారీగా అభిమానులు చేరుకున్నారు. గేట్-6 వద్ద భారీ సంఖ్యలో అభిమానులు గుమిగూడడంతో తొక్కిసలాట చోటుచేసుకొవడంతో ఇద్దరు ఆర్సీబి అభిమానులకు తీవ్ర గాయలయ్యాయి. ఇందులో ఆరుగురు మరణించారు.అలాగే ఈ ఘటనలో 15 మందికి పైగా గాయాలపాలయ్యారు. వీరిలో ఇద్దరి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటన జరిగిన వెంటనే బాధితులను శివాజినగర్ లోని బౌరింగ్, లేడీ కర్జన్ ఆసుపత్రికి తరలించారు. మరోవైపు, తొక్కిసలాట సమయంలో బ్యారికేడ్లు కూలిపోవడంతో ముగ్గురి కాళ్లు విరిగాయి. మరో ఆరుగురికి పైగా తీవ్ర గాయాలయ్యాయి. స్టేడియం వెలుపల జనసమూహం కూడా భారీగా ఉండటంతో, ఆ మార్గంలో వెళ్లే వాహనాలు ముందుకు కదలలేక ట్రాఫిక్ జామ్ అయింది. జనసమూహాన్ని నియంత్రించలేక పోలీసులు లాఠీచార్జ్ చేశారు. తొక్కిసలాటలో చాలా మంది తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు గాయపడిన వారిని తమ జీపులో ఆసుపత్రికి తరలించారు.ఆర్సీబి విజయం తరువాత అభిమానులు సంబరాల్లో మునిగి తేలుతుండగా ఇలాంటి విషాదకర ఘటన జరగడం అందరినీ కలచివేసింది. ఆటగాళ్లను చూడాలని స్టేడియం వద్ద అభిమానులు పెద్ద సంఖ్యలో చేరడం వల్ల వేదిక వద్ద భారీగా జనం రావడంతో పోలీసులు వారిని అదుపు చేయడంలో నియంత్రణ కోల్పోయిన పరిస్థితుల్లో తొక్కిసలాట జరిగింది.

**చిన్న స్వామి స్టేడియంలో తొక్కిసలాట...స్పందించిన డిప్యూటీ సీఎం..!**

కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ ఎం చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తొక్కిసలాట ఘటనపై స్పందించారు. ఇండియా టుడేతో ఆయన మాట్లాడారు. జనసమూహాన్ని నిర్వహించడానికి 5000 మంది సిబ్బందిని నియమించినట్లు స్పష్టం చేశారు. కానీ మరణాల సంఖ్యను మాత్రం నిర్ధారించలేదు. "నేను ఇంకా సంఖ్యలను నిర్ధారించలేను, నేను ఇప్పుడు స్టేడియంకు వెళ్తున్నాను. చాలా మంది భావోద్వేగ అభిమానులను చేరుకున్నారు. 5000 సిబ్బందిని మోహరించాం" అని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ ఇండియా టుడేతో అన్నారు. కాగా.. ఈ ఘటనలో ఆరుగురు మరణించినట్లు తెలుస్తోంది.కాగా.. ఇండియన్ ప్రీమియర్ లీగ్ కిరీటం కోసం ఆర్సీబీ18 ఏళ్ల నిరీక్షణకు ముగింపు పలికింది. నేడు బెంగళూరుకు చేరుకున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబి) జట్టుకు అపూర్వ స్వాగతం లభించింది. ఛాంపియన్లను చూసేందుకు వేలాది మంది ఆనందోత్సాహాలతో అభిమానులు వీధుల్లోకి వచ్చారు. జూన్ 4 బుధవారం విమానాశ్రయంలో ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ విరాట్ కోహ్లీ, కెప్టెన్ రజత్ పాటిదార్ వంటి స్టార్ ఆటగాళ్లను స్వయంగా స్వాగతించారు. ఇంతలో తొక్కిసలాట జరిగినట్లు సమాచారం అందింది. ఆయన హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు.

**కన్నీళ్లు పెట్టిస్తున్న విజువల్స్**

ఐపీఎల్ 2025 ఛాంపియన్ గా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు నిలిచింది. ఈ క్రమంలోనే బెంగళూరులో ఆర్సీబీకి ఘన స్వాగతం లభించింది. అయితే, ఆర్సీబీ విక్టరీ పరేడ్ లో తీవ్ర చోటు చేసుకుంది. ఆర్సీబీ విజయంతో నగరమంతా ఉత్సాహంలో మునిగిపోయిన వేళ, చిన్నస్వామి స్టేడియం దగ్గర జరిగిన తొక్కిసలాట తీవ్ర విషాదం మిగిల్చింది. పెద్ద సంఖ్యలో ఫ్యాన్స్ రావడంతో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో సుమారు 11 మంది ప్రాణాలు కోల్పోయారు.. మరో 37 మందికి పైగా గాయపడ్డారని తెలుస్తుంది.అయితే, ఈ దుర్ఘటన జరిగిన సమయంలో.. వేలాది మంది అభిమానులు చిన్నస్వామి స్టేడియం దగ్గరకు చేరుకొని ఆర్సీబీ జట్టును చూసేందుకు ఎగబడ్డారు. అభిమానులు అందరూ ఒక్కసారిగా రావడంతో స్టేడియం గేట్ల వద్ద తొక్కిసలాట జరిగింది. ప్రవేశ టికెట్లు ఉన్నవారికే పోలీసులు అనుమతి ఇచ్చినా.. అదుపు తప్పిన జనసందోహం ఈ ప్రమాదానికి కారణమైంది.ఈ తొక్కిసలాటలో గాయపడిన వారిని స్థానికంగా ఉన్న బోరింగ్, వైదేహి ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రాణాలు కోల్పోయిన వారిలో చిన్నారులు, యువ కులు ఉన్నారు. అయితే, స్టేడియంలో తొక్కిసలాట జరిగిన తర్వాత నెలకొన్న దృశ్యాలు క న్నీళ్లు పెట్టిస్తున్నాయి.

**ఘటనపై బీజేపీ సంచలన ఆరోపణలు..**

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయోత్సవ కార్యక్రమం సందర్భంగా పెను విషాదం చోటు చేసుకుంది. చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట ఘటన జరిగింది. ఈ ఘటనలో 11 మంది మృతి చెందినట్లు తెలుస్తోంది. కర్ణాటక బీజేపీ అధ్యక్షుడు బివై విజయేంద్ర బౌరింగ్, లేడీ కర్జన్ ఆస్పత్రికి చేరుకున్నారు. గాయపడిన వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా కర్ణాటక బీజేపీ అధ్యక్షుడు బి.వై. విజయేంద్ర మాట్లాడుతూ.. "ఈ విషాదానికి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలి. మొత్తం దేశం, కర్ణాటక ఆర్ సీబీ విజయాన్ని ఘనంగా నిర్వహించారు. కానీ.. ముందస్తు సన్నాహాలు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం విజయ ర్యాలీని నిర్వహించడానికి తొందరపడటం ఈ విషాదానికి దారితీసింది. రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు సన్నాహాల గురించి పట్టించుకోలేదు. వారు ప్రచారంపై ఎక్కువ ఆసక్తి చూపారు. దీని ఫలితంగా 11 మందికి పైగా మరణించారు. కొంతమంది ఐసీయూలో ఉన్నారు. నేను కొంతమంది బాధితులతో మాట్లాడాను, లోపల పోలీసులు లేరు, అంబులెన్స్ సౌకర్యం లేదు. ముఖ్యమంత్రి ఈ విషయాన్ని న్యాయ విచారణకు పంపాలి." అని ఆయన డిమాండ్ చేశారు.ఈ అంశంపై డిప్యూటీ సీఎం శివకుమార్ స్పందించారు. "నేను పోలీస్ కమిషనర్ తో, అందరితో మాట్లాడాను. నేను కూడా తర్వాత ఆసుపత్రికి వెళ్తాను. మృతుల సంఖ్యను ఇప్పుడు చెప్పలేం. ప్రజలు ప్రశాంతంగా ఉండాలని మేము విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ ఘటన కారణంగా ఈ కార్యక్రమాన్ని కుదించాం. కార్యక్రమం 10 నిమిషాల్లో ముగిసింది. లక్షల మంది వచ్చారు. పరిస్థితులను చక్కదిద్దేందుకు యత్నిస్తున్నాం." అన్నారు. బీజేపీ ఆరోపణలపై కర్ణాటక డిప్యూటీ సీఎం డికె శివకుమార్ స్పందించారు. వారు ఆరోపణలు చేయడానికే ఉన్నారు. మేము రక్షించడానికి ఉన్నామని వెల్లడించారు.

**సీఎం, డిప్యూటీ సీఎం హగ్స్, ఫోటోల్లో బిజీగా ఉన్నారు..**

ఐపీఎల్ 2025 ఛాంపియన్ గా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నిలవడంతో.. బెంగళూరులో ఆర్సీబీ విక్టరీ వేడుకలు నిర్వహించింది. ఈ సందర్భంగా చిన్నస్వామి స్టేడియంలో ఏర్పాటు చేసిన వేడుకలు చూడటానికి అభిమానులు భారీగా తరలి వచ్చారు. దీంతో గ్రౌండ్ గేట్ల వద్ద జరిగిన విషాదకరమైన తొక్కిసలాట ప్రస్తుతం రాజకీయంగా తీవ్ర కలకలం రేపుతుంది. కాంగ్రెస్ నేతృత్వంలోని కర్ణాటక ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం, పరిపాలనా వైఫల్యానికి కారణమైందని భారతీయ జనతా పార్టీ ఆరోపించింది. అమాయకమైన 11 మంది ప్రాణాలు కోల్పోగా, అనేక మంది గాయపడ్డారని బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాల్వియా ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు.అయితే, బెంగళూరులో జరిగిన తొక్కిసలాట.. ఒక పీడకలగా మారింది అని బీజేపీ ఐటీ సెల్ చీఫ్ మాల్వియా పేర్కొన్నారు. ఒక వైపు, తొక్కిసలాట జరిగిన అభిమానులు తీవ్ర నిరాశలో ఉంటే.. వేదికపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివ కుమార్ మాత్రం క్రికెటర్లతో కౌగిలింతలు, ఫోటోలు తీసుకోవడంతో చాలా బిజీగా ఉన్నారని ఆరోపించారు. జన సమూహాన్ని నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుందని అమిత్ మాల్వియా అన్నారు.

# తుని రైలు ప్రమాదం కేసు..

- తుని రైలు ప్రమాదం కేసు అంశంపై కేబినెట్ లో ప్రస్తావన..
- ప్రతీ జీవోను జాగ్రత్తగా గమనించాలని మంత్రులకు దిశానిర్దేశం..
- పొరపాటు జరిగాక సరిదిద్దుకోవడం కంటే.. ముందే జాగ్రత్త పడాలి..
- ఈ తరహా పరిణామాలు మళ్లీ పునరావృతం కాకూడదన్న సీఎం..



**ఆంధ్రప్రదేశ్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఏపీ కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు.. పలు అంశాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది కేబినెట్ .. ఇక, మంత్రులతో వివిధ అంశాలపై చర్చించారు సీఎం చంద్రబాబు.. ఇదే సమయంలో.. తుని రైలు ప్రమాదం కేసు అంశంపై మంత్రివర్గంలో ప్రస్తావనకు వచ్చిందట.. ప్రతీ జీవోను జాగ్రత్తగా గమనించాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు సీఎం నారా చంద్రబాబు నాయుడు.. పొరపాటు జరిగాక సరిదిద్దుకోవడం కంటే.. ముందే జాగ్రత్త పడాలని సీఎం చంద్రబాబు సూచించారు.. ఈ తరహా పరిణామాలు మళ్లీ పునరావృతం కాకూడదని స్పష్టం చేశారు సీఎం చంద్రబాబు.. అయితే, జరిగిన పొరపాటుకు సీఎంకు క్షమాపణలు చెప్పారు హోంశాఖ కార్యదర్శి..కాగా, తుని రైలు దహనం కేసు రీ ఓపెన్ కోసం జీవో ఇచ్చి 24 గంటలు కూడా గడవక ముందే ఏపీ సర్కార్ మరో జీవోను విడుదల చేసిన విషయం విదితమే.. కాపులకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ తో 2016 జనవరి 31న తునిలో బహిరంగ సభ నిర్వహించారు. ఆ మీటింగ్ తర్వాత రత్నాచల్ ఎక్స్ ప్రెస్ కు నిప్పు పెట్టారు ఆందోళనకారులు. తుని టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్లను కాల్చేశారు. రైల్వే ఆస్తులు ధ్వంసం చేశారంటూ విజయవాడ రైల్వే కోర్టులో దాదాపు ఏడేళ్ళు విచారణ జరిగింది. విచారణ తర్వాత ఈ కేసులో నాటి కాపు ఉద్యమ నేత ముద్రగడతో పాటు మరో 41 మందికి సంబంధం లేదని కొట్టేసింది కోర్ట్ . అయితే.. ఆ తీర్పు మీద ఇప్పుడు కూటమి ప్రభుత్వం హై కోర్ట్ లో అప్పీల్ కు వెళ్ళాలని నిర్ణయిచడం సంచలనమైంది. దీనికి సంబంధించిన జీవో కూడా జారీ అవడం ఒక ఎత్తయితే... 24 గంటలు గడవకముందే దాన్ని రద్దు చేస్తూ ఆదేశాలు రావడం అంతకు మించిన సంచలనమైంది. తుని కేసును తిరగదోడే ఉద్దేశం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని క్లారిటీ ఇచ్చేసింది ప్రభుత్వం.. కేసును కొట్టేస్తూ.. రైల్వే కోర్ట్ ఇచ్చిన తీర్పును హైకోర్ట్ లో సవాల్ చేయబోమని కూడా ప్రభుత్వం క్లారిటీ ఇచ్చిన విషయం విదితమే..

# త్వరలో రిజర్వేషన్‌లు ఖరారు..

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** మున్సిపల్ ఎన్నికలకు తెలంగాణ ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. కొత్త మున్సిపాలిటీలలో వార్డుల విభజనకు కసరత్తు చేసింది. ఈ మేరకు మున్సిపల్ శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వార్డుల విభజనకు సంబంధించి నోటిఫికేషన్ మంగళవారం విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 18 కొత్త మున్సిపాలిటీలు, 5 కొత్త మున్సిపల్ కార్పొరేషన్లు ఏర్పాటు కానున్నాయి. 7 మున్సిపాలిటీల్లో సమీప గ్రామాలు విలీనం అయ్యాయి. కొత్త మున్సిపాలిటీలు, కార్పొరేషన్ లలో వార్డుల విభజన ప్రక్రియకు మున్సిపల్ శాఖ అధికారి శ్రీదేవి షెడ్యూల్ విడుదల చేశారు. ఈ నెల 21 వరకు వార్డుల విభజన ప్రక్రియ పూర్తి చేసేలా అధికారులను ఆదేశించారు.

**త్వరలో రిజర్వేషన్ లు ఖరారు..**

ప్రభుత్వం ఇప్పటికే గ్రామాల్లో, పంచాయతీల్లో వార్డుల విభజన, ఓటరు జాబితాను తయారు చేసింది. ఎంపీటీసీల విభజన, ఓటరు జాబితాను సిద్ధం చేసి ఎన్నికలకు సన్నద్ధమవుతోంది. త్వరలో ఎన్నికలకు అవసరమైన రిజర్వేషన్లు ఖరారు చేయనున్నట్లు తెలియవచ్చింది. ఈ నేపథ్యంలో పట్టణాల్లోనూ వార్డుల విభజన చేపట్టడంతో ఆ తర్వాత ఓటరు జాబితా పూర్తికానుంది. అనంతరం ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని అధికారవర్గాలు చెబుతున్నాయి. పంచాయతీ, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ ఎన్నికలు పూర్తి కాగానే పట్టణ స్థానిక సంస్థల (మున్సిపల్) ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకోసం యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేస్తున్నది. స్థానిక సంస్థల ఎన్నికలు వరుసగా జరగనున్నాయి.

**పునర్విభజన ఇలా..**

కొహిర్, కేసముద్రం, అశ్వరావుపేట, స్టేషన్ ఘనపూర్, మద్దూర్, ఎదులాపురం, దేవరకద్ర, గడ్డపోతారం, గుమ్మడిదల, ఇస్నాపూర్, చేవెళ్ల, మొయినాబాద్, ములుగు, బిచ్కుంద, కల్లూరు, అలియాబాద్, మూడుచింతలపల్లి, ఎల్లంపేట మున్సిపాలిటీల్లో వార్డుల విభజన జరగనుంది. మహబూబ్ నగర్, మంచిర్యాల, కరీంనగర్, రామగుండం, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్లు, నర్సంపేట, పరిగి, కొల్లాపూర్, ఆలేరు, బాన్సువాడ, జగిత్యాల, హాలియా మున్సిపాలిటీల్లో విలీనమైన ప్రాంతాల్లోనూ కొత్త వార్డులు ఏర్పాటు కానున్నాయి. కొత్త మున్సిపాలిటీల్లో వార్డుల విభజన తర్వాత జూన్ నెలాఖరు వరకు రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేసి ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని భావిస్తోంది.

# గేటు బయటే తన్ని తరిమేస్తాం

## కేసీఆర్ ఫ్యామిలీ పాలిటిక్స్ పై బీజేపీ ఎంపీ హాట్ కామెంట్స్



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** లేఖ డ్రామా ద్వారా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తాను అనుకున్నది సాధించిందని బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ తో తాజా పరిణామాల వెనుక ఉన్నది కేసీఆరేనని, ఫామ్ హౌస్ లో కూర్చుని ఇదంతా కేసీఆర్ చేస్తున్న ప్లాన్ అని ఆరోపించారు. కవిత ఎపిసోడ్ పై తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన కొండా.. బీఆర్ఎస్ కు ప్రజల్లో ఆదరణ తగ్గుతుండటం వల్ల ఈ డ్రామా చేస్తున్నారని ఇదంతా ట్రాష్ అని అన్నారు. ఈ వ్యవహారం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించడం, న్యూస్ హెడ్ లైన్స్ లో నిలవడంలో కవిత తాను అనుకున్నది సాధించిందన్నారు. కేసీఆర్ ఫ్యామిలీ అంతా ప్రొఫెషనల్ పొలిటిషియన్స్ అని అవసరం అయితే కాళ్లు పట్టుకుంటారు లేకుంటే జుట్టుపట్టి తరిమేస్తారని హాట్ కామెంట్స్ చేశారు.

**గేట్ వద్దే తన్ని తరిమేస్తాం:**

బీఆర్ఎస్, బీజేపీ విలీనం, పొత్తు అంశంపై స్పందిస్తూ.. కేసీఆర్ కుటుంబసభ్యులు బీజేపీ దగ్గరికి వస్తే గేట్ వద్దే తన్ని తరిమేస్తామని ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్, బీజేపీ ఆరు నూరైనా కలవదన్నారు. రాజకీయాల్లో సమీకరణాలు మారుతుంటాయని కానీ కొన్ని మారవన్నారు. కేసీఆర్ ఆడిస్తున్న డ్రామా ఎప్పటికి డ్రామాగానే మిగిలిపోతుందని ఇక ఎప్పటికీ ఆయన సక్సెస్ కాలేరన్నారు. కేసీఆర్ కు తన ఫ్యామిలీ ఫస్ట్, పార్టీ సెకండ్ తెలంగాణ లాస్ట్ అని సెటైర్ వేశారు. నిజానికి బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యే పొత్తు ఉందని మునుగోడు ఉప ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు కలిసి పని చేసి మాపై బురద జల్లారన్నారు. మేము కవితను అరెస్ట్ చేశామని మరి కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్, కేటీఆర్ ను ఎవరినైనా అరెస్టు చేశారా అని ప్రశ్నించారు.

# సైనికులను కించపరచే హక్కు లేదు..

**అలహాబాద్:** కాంగ్రెస్ సీనియర్ నేత, లోక్ సభలో విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పై అలహాబాద్ హైకోర్టు బుధవారంనాడు ఆగ్రహం వ్యక్తం చేసింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) స్వేచ్ఛగా మాట్లాడే హక్కు కల్పిస్తోందని, అయితే వాక్ స్వాతంత్రానికి కూడా పరిమితులు ఉంటాయని గుర్తుచేసింది. వ్యక్తులు, సైనికులను కించపరచేలా మాట్లాడే హక్కు లేదని పేర్కొంది. లక్నో కోర్టు జారీ చేసిన సమన్లను సవాలు చేస్తూ రాహుల్ వేసిన పిటిషన్ హైకోర్టు కొట్టివేసింది.రాహుల్ గాంధీ 2022లో భారత్ జోడో యాత్ర సందర్భంగా చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. అరుణాచల్ ప్రదేశ్ లో చైనా సైనికులు భారత సైనికులను కొట్టారంటూ రాహుల్ చేసిన వ్యాఖ్యలు భారత బలగాలను కించపరచేలా ఉన్నాయంటూ రిటైర్డ్ బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ ఉదయ్ శంకర్ శ్రీవాత్సవ పరువునష్టం కేసు వేశారు. దీనిపై అడిషనల్ చీఫ్ మెజిస్ట్రేట్ అలోక్ వర్మ మార్చి 24న రాహుల్ గాంధీ కోర్టుకు హాజరుకావాలంటూ సమన్లు పంపారు. అయితే ఈ ఆదేశాలను రాహుల్ సవాలు చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు.ఫిర్యాదుదారు ఆర్మీ అధికారి కాదని, ఆయనను తాను వ్యక్తిగతంగా కించపరచ లేదని రాహుల్ గాంధీ చేసిన వాదనను హైకోర్టు తోసిపుచ్చింది. పిటిషనర్ కు ఆర్మీ పట్ల ఎంతో గౌరవం ఉందని, ఆర్మీపై చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగతంగా ఆయనను గాయపరచినందున పిటిషన్ వేయడానికి ఆయన అర్హుడేనని స్పష్టం చేస్తూ.. రాహుల్ పిటిషన్ ను తోసిపుచ్చింది.

# మాజీ ఎమ్మెల్సీ మృతి పట్ల సీఎంరేవంత్ సంతాపం




**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** శాసనమండలి మాజీ సభ్యుడు, సీనియర్ నాయకుడు మాగం రంగారెడ్డి మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మాగం రంగారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ మేరకు సోషల్ మీడియా(ఎక్స్) వేదికగా పోస్టు పెట్టారు. కాగా, మాజీ ఎమ్మెల్సీ మాగం రంగారెడ్డి బుధవారం గుండెపోటుతో తుదిశ్వాస విడిచినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం శామీర్ పేటలో రంగారెడ్డి అంత్యక్రియ నిర్వహించనున్నారు. మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డికి రంగారెడ్డి సన్నిహితులుగా ఉండేవారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఒక సారి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. రంగారెడ్డి మృతిపట్ల వివిధ పార్టీల నేతలు సంతాపం తెలిపారు.

# ఎమ్మెల్యే మాగంటి కుట్ర

- అతని మరణం తనను కలిచి వేసిందని మాజీ డిప్యూటీ మేయర్ ఫసియుద్దీన్ అన్నారు.
- సర్దార్ చనిపోయాడని తెలియగానే వెళ్లాలనుకున్నానని
- అక్కడ తనను చంపేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.
- సర్దార్ ప్రమాదవ శాత్తు చనిపోయాడని పోలీసులు రిపోర్ట్ కూడా ఇచ్చారని.. కానీ...



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ , కాంగ్రెస్ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ కంటతడి పెట్టుకున్నారు. బోరబండకు చెందిన సర్దార్ మరణాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ రాజకీయం చేశారని ఆయన ఆరోపించారు. సర్దార్ ఆత్మహత్య చేసుకున్నా.. తానే కారణమన్నట్లుగా ఎమ్మెల్యే ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తనపై దాడి చేయించేందుకు గోపీనాథ్ ప్రయత్నించారని ఆరోపించారు. సర్దార్ మరణానికి తాను కారణం కాదని అంతిమ యాత్రకు వెళ్లాలని అనుకున్నా.. శాంతి భద్రతలకు సమస్య అవుతుందని పోలీసులు వద్దని చెప్పారని ఫసియుద్దీన్ వివరించారు.

**మాగంటి గోపినాథ్ శవ రాజకీయాలు..**

ఈ సందర్భంగా బుధవారం ఫసియుద్దీన్ మీడియాతో మాట్లాడారు. సర్దార్ తనకు దగ్గరి వాడని .. అతని మరణం తనను కలిచి వేసిందని అన్నారు. సర్దార్ చనిపోయాడని తెలియగానే వెళ్లాలనుకున్నానని, కానీ అక్కడ తనను చంపేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్దార్ ప్రమాదవ శాత్తు చనిపోయాడని పోలీసులు రిపోర్ట్ కూడా ఇచ్చారని.. కానీ సూసైడ్ చేసుకున్నాడని ఎమ్మెల్యే మాగంటి అసత్య ప్రచారం చేశారని ఆరోపించారు. మాగంటి గోపినాథ్ శవ రాజకీయాలు చేశారని, తనపై, తన ఇంటిపై మాగంటి దాడి చేయించడానికి ప్రయత్నించారని అన్నారు. తనపై దాడి చేయాలని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టించారని అన్నారు. తనపై అసత్య ఆరోపణలు చేస్తున్న వారిపై నగర కమీషనర్ కు ఫిర్యాదు చేస్తానని చెప్పారు. కొంత మంది రౌడీ షీటర్లతో తనకు ప్రాణ హాని ఉందని.. ప్రభుత్వం భద్రత కల్పించాలని కోరుతున్నానని ఫసియుద్దీన్ అన్నారు.కాగా హైదరాబాద్ లోని బోరబండ డివిజన్ బీఆర్ ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ సర్దార్ (33) ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. బాబా ఫసియుద్దీన్ దంపతుల వేధింపులతోనే సర్దార్ ఆత్మహత్యకు పాల్పడ్డారంటూ బంధువులు, బీఆర్ ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. పోలీసు స్టేషన్ ఎదుట బైఠాయించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో బోరబండ ప్రాంతంలో, ఫసియుద్దీన్ నివాసం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సర్దార్ సోదరుడు ఇబ్రహీం ఫిర్యాదు మేరకు ఫసియుద్దీన్ , ఆయన భార్య హబీబాషేక్ , పీఏ సప్తగిరితోపాటు మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తన సోదరుడు ఇటీవల ఇంటి ఆధునీకరణ పనులు చేపట్టారని.. దీనితో డబ్బులు డిమాండ్ చేస్తూ వారు వేధించారని ఇబ్రహీం ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ వేధింపులు తట్టుకోలేక సర్దార్ ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. సర్దార్ మృతదేహాన్ని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ , మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

# కాంగ్రెస్ కి పరిపాలన చేత కావడం లేదు

- కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాలన చేత కావడం లేదు
- ఎర్రగడ్డలో మానసిక రోగులకు అన్నం పెట్టడానికి చేత కావడం లేదు
- 70 మంది అస్వస్థతకు గురైతే సీఎం ఇప్పటివరకు స్పందించలేదు
- వేములవాడలో కోడెల మృత్యువాత పడుతుంటే మీకు సోయి లేదా : హరీష్ రావు

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** వేములవాడలో కోడెల మృతి, ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనలపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాలన చేయడం చేతకావడం లేదని వ్యాఖ్యానించారు. ఎర్రగడ్డ మానసిక రోగులకు తగిన ఆహారం కూడా అందడం లేదని 70 మంది అస్వస్థతకు గురయ్యారని, ఈ విషయంపై ఇప్పటివరకు సీఎం నుంచి ఎలాంటి స్పందన కనిపించలేదని మండిపడ్డారు. వేములవాడలో కోడెల మరణం కొనసాగుతుండగా ప్రభుత్వం స్తంభించినట్లే ఉంది అని వ్యాఖ్యలు చేశారు.అనేక కోడెలు గడ్డి లేక చనిపోతున్నా, ప్రభుత్వం పట్టింపు తీసుకోవడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "మాకు బాధ్యత అప్పగిస్తే కోడెలను కాపాడుతాం" అని స్పష్టత ఇచ్చారు. ఈ మధ్యే మాపై కేసులు పెట్టడం, కమిషన్లు ఏర్పాటు చేయడం తప్ప అసలు సమస్యలపై ప్రభుత్వాన్ని పట్టించుకోడం లేదని, నిజమైన ప్రజా సమస్యలను వదిలి మిగతా విషయాల్లో బిజీ అయ్యారని తెలిపారు. ఇక రేపటి కేబినెట్ సమావేశంలో రైతు బంధు డబ్బులను వెంటనే విడుదల చేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని తీవ్రంగా పిలుపునిచ్చారు.

# రాహుల్ గాంధీ ఆపరేషన్ సిందూర్‌ని వ్యతిరేకించలేదు..



- మాకు భారత రక్షణ దళాల మీద అత్యంత గౌరవం ఉంది
- రాహుల్ ఎక్కడ కూడా ఆపరేషన్ సిందూర్‌ని వ్యతిరేకించలేదు
- ఆర్మీ కి వ్యతిరేకంగా మాట్లాడలేదని వీహెచ్ హనుమంతరావు స్పష్టం

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** పెహల్గాంలో 27 మంది భారతీయులను చంపిన దుర్మార్గం చర్యపై ప్రతి భారతీయుడు చాలా సీరియస్ గా ఉన్నారని కాంగ్రెస్ సీనియర్ నేత వీ.హనుమంతరావు అన్నారు. దేశంలో ఉన్న అన్ని పార్టీలు, ప్రధాని మోడీకి ఫ్రీ హ్యాండ్ ఇచ్చారని.. ఆ తర్వాత 9 ఉగ్రవాద స్థావరాల మీద ఆపరేషన్ సిందూర్ చేయడం జరిగిందన్నారు. అమెరికా ప్రెసిడెంట్ మోడీని లొంగిపో అన్నారని.. అమెరికా ఒత్తిడి కి లొంగి ఆపరేషన్ సింధూర్ ఆపేశారని ఆరోపించారు. భారత దేశానికి చెందిన ఏ విషయంలో అయినా క్రెడిట్ మన దేశానికే రావాలని.. అమెరికా కి కాదన్నారు. తమకు భారత రక్షణ దళాల మీద అత్యంత గౌరవం ఉందని స్పష్టం చేశారు.రాహుల్ గాంధీ కేవలం మోడీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిడికి లొంగి యుద్ధాన్ని ఆపేశారు అని అన్నట్లు హనుమంతరావు వెల్లడించారు. ఆయన ఎక్కడ కూడా ఆపరేషన్ సిందూర్ ని వ్యతిరేకించలేదని తెలిపారు. ఆర్మీకి వ్యతిరేకంగా మాట్లాడలేదని చెప్పారు. అన్ని పార్టీలు మద్దతు ఇచ్చినపుడు ఏం చేయలేకపోయారన్నారు. ఇపుడు మీ తప్పుకి రాహుల్ గాంధీని ఏజెంట్ అనడం మీ వైఫల్యమని మండిపడ్డారు. అసలు ఈ దేశనికి స్వాతంత్ర్యం తెచ్చిందే గాంధీ ఫ్యామిలీ... ఆ కుటుంబం దేశం కోసం త్యాగాలు చేసిందన్నారు. రాహుల్ గాంధీని అవమానిస్తే ఊరుకోమని హెచ్చరించారు.

# రాజకీయ దురుద్దేశంతోనే కేసీఆర్‌కు నోటీసులు

- నీళ్లు ఇచ్చిన కేసీఆర్‌కు.. నోటీసులు ఇవ్వడాన్ని సహించమని రేవంత్
- ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ కవిత హెచ్చరించారు.
- పెద్ద ప్రాజెక్టు కట్టినప్పుడు చిన్న సమస్యలు సాధారణమేనని తెలిపారు.
- కుంగిన మేడిగడ్డ పిల్లర్‌కు రిపేర్ చేయాలని ఎమ్మెల్సీ కవిత కోరారు.
- ఇందిరా పార్క్ వద్ద కవిత నేతృత్వంలో తెలంగాణ జాగృతి మహాధర్నా
- కేసీఆర్‌కు నోటీసులపై కాంగ్రెస్‌పై ఘాటు విమర్శలు
- తెలంగాణ హక్కుల కోసం కేంద్రాన్ని డిమాండ్ చేసిన ఎమ్మెల్సీ కవిత




**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పూరితంగా నోటీసులు ఇచ్చిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ(బుధవారం) ఇందిరాపార్క్ వద్ద జాగృతి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధర్నా నిర్వహించారు. కేసీఆర్ కు కాళేశ్వరం కమిషన్ నోటీసులకు వ్యతిరేకంగా ధర్నా చేశారు. కవిత కార్యక్రమాలకు బీఆర్ఎస్ నేతలు దూరంగా ఉన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జాగృతి ధర్నా జరుగనుంది. ఈ ధర్నాలో పెద్ద సంఖ్యలో జాగృతి కార్యకర్తలు పాల్గొన్నారు. మరోవైపు కేసీఆర్ కు నోటీసులిస్తే.. పోరాటం చేయలేదని మాజీ మంత్రి కేటీఆర్ పై కవిత పరోక్ష విమర్శలు చేశారు. ఈ సందర్భంగా మీడియాతో కవిత మాట్లాడారు.నీళ్లు ఇచ్చిన కేసీఆర్ కు.. నోటీసులు ఇవ్వడాన్ని సహించమని హెచ్చరించారు. తన గురువు చంద్రబాబు గోదావరి జలాలను తరలించుకుపోతుంటే.. సీఎం రేవంత్ రెడ్డి మౌనంగా ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. బనకచర్ల ప్రాజెక్ట్ ను ఆపమని లేఖ రాయటానికి ధైర్యం లేదా అని నిలదీశారు. వెంటనే రేవంత్ రెడ్డి.. అపెక్స్ కౌన్సిల్, కేంద్రానికి లేఖ రాయాలని కోరారు. పెద్ద ప్రాజెక్టు కట్టినప్పుడు చిన్న సమస్యలు సాధారణమేనని తెలిపారు. కుంగిన మేడిగడ్డ పిల్లర్ కు రిపేర్ చేయాలని కోరారు. 21కి గాను.. 20 పంపు హౌస్ లు మెగా కృష్ణారెడ్డి కట్టారని గుర్తుచేశారు. మెగా కృష్ణారెడ్డిని కమిషన్ విచారణకు పిలిచే దమ్ముందా అని సవాల్ విసిరారు. కాంట్రాక్టర్ ను విచారణకు ఎందుకు పిలవటం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు.చంద్రబాబు మీద ఆధారపడి బీజేపీ.. కేంద్రంలో ప్రభుత్వాన్ని నడుపుతోందని ఆరోపించారు. అందుకే కేంద్రమంత్రులుగా ఉన్న కిషన్ రెడ్డి, బండి సంజయ్ మాట్లాడటం లేదని మండిపడ్డారు. తెలంగాణ బిడ్డ ఈటల రాజేందర్ అయినా ఈ విషయంపై మాట్లాడాలని కోరారు. రైతులు, జాగృతి తరుపున మాట్లాడాలని ఈటలకు విజ్ఞప్తి చేశారు. నోరు కట్టేసుకుని అపవాదు తెచ్చుకోవద్దని ఈటల రాజేందర్ ను కోరారు. తెలంగాణ ప్రయోజనాల కోసం ఈటల రాజేందర్ ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని కోరారు. గోదావరిలో వెయ్యి టీఎంసీల నీళ్లు వచ్చేవరకు జాగృతి ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని ప్రకటించారు. రాజకీయ దురుద్దేశంతో కేసీఆర్ కు నోటీసులు ఇచ్చారని ఆరోపించారు.నీళ్లు, నిధులు తీసుకురావటం కేసీఆర్ చేసిన తప్పా అని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే మూడు బ్యారేజులు కాదని.. 21పంపు హౌస్ లు, కాళేశ్వరంతో 35శాతం తెలంగాణ భూభాగానికి నీళ్లు వస్తున్నాయని స్పష్టం చేశారు. హైదరాబాద్ కు శ్వాశతంగా నీటి అవసరాలు తీరుతాయని వెల్లడించారు. కేసీఆఎర్ ది గట్టి గుండె కాబట్టే.. కాళేశ్వరం కట్టారని ఉద్ఘాటించారు. కాంగ్రెస్ కలలో కూడా కాళేశ్వరం లాంటి ప్రాజెక్టు కట్టలేదని ఎద్దేవా చేశారు. ప్రాణహిత చేవెళ్ల పేరుతో.. వైఎస్ఆర్ 16టీఎంసీలు మాత్రమే తెలంగాణకు కేటాయించారని అన్నారు. కేసీఆర్ ..141టీఎంసీలు తెలంగాణకు నిల్వ ఉండాలని కేసీఆర్ కట్టారని చెప్పారు. జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞం చేశారని విమర్శించారు. పర్మిషన్ ఉన్నప్పటికీ.. జాగృతి దర్నాకు పోలీసులు ఎందుకు ఇబ్బందులు పెడుతున్నారని ప్రశ్నించారు. బైండోవర్ పేరుతో అరెస్టులు చేయటాన్ని ఆపాలని కవిత కోరారు.

# కవితకు తెలంగాణ పౌరుషం లేదు..





- మాలాంటి వారికి తెలంగాణ వాదం నేర్పించింది బీజేపీ
- మాకు కాకుండా ఇంకెవరికి తెలంగాణ పౌరుషం ఉంటది
- మాది హిందుగాళ్లు బొందు గాళ్ళు అన్న రక్తం కాదు
- కవిత స్టేట్మెంట్ ఇచ్చే ముందు స్థాయి చూసుకోవాలి
- కవితపై బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** అమెరికాలో ఉద్యోగం చేసిన కవితకు తెలంగాణ పౌరుషం లేదని బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అన్నారు. తమ లాంటి వారికి తెలంగాణ వాదం నేర్పించింది బీజేపీ అని.. తమకు కాకుండా ఇంకెవరికి తెలంగాణ పౌరుషం ఉంటది? అన్నారు. తమది హిందుగాళ్లు బొందు గాళ్లు అన్న రక్తం కాదని.. కవిత స్టేట్మెంట్ ఇచ్చే ముందు స్థాయి చూసుకోవాలని విమర్శించారు. తాజాగా ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. రాహుల్ గాంధీది ఇటలీ రక్తం.. మోడీది హిందువు రక్తం అని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటలీ గాంధీ స్థాయి దిగజారి మాట్లాడుతున్నారని.. అమెరికా చెప్తే వినడానికి మాది పాత భారత్ కాదు ఇది కొత్త భారత్ అని తెలిపారు. రాహుల్ టి షర్ట్స్ వేసుకోవడం మాని తెలివితో మాట్లాడాలని ఎద్దేవా చేశారు.బీఆర్ ఎస్ ధర్నా చౌక్ లు ఎత్తేసిందని.. కల్వకుంట్ల కుటుంబానికి, కవితకు ధర్నా చౌక్ లో నిలబడే అర్హత లేదన్నారు.కాళేశ్వరానికి అన్ని తానే అని అపర బ్రహ్మ కేసీఆర్ చెప్పుకున్నారు.. అపర బ్రాహ్మ అని చెప్పుకున్న కేసీఆర్ కు కూతురు కవిత డాడీ డాడీ స్ట్రక్చర్ ఎలా నిర్మించారని మరొక్క లెటర్ రాయాలని బీజేపీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి అన్నారు. కేసీఆర్ ఏ కాలేజీలో చదివారు.. ఎక్కడ సివిల్ ఇంజనీరింగ్ చేశారు? ఎన్ని ప్రాజెక్ట్ లు చేశారు? అని ప్రశ్నించారు. తాము ఇప్పటిదాకా ఈడీ ఒక్కదాన్నే చూపించామని.. మీరు చూడాల్సిన డీలు ఇంకా చాలా ఉన్నాయన్నారు. అధికార గణమంతా అందాల భామల చుట్టూ తిరిగారని.. తెలంగాణ రైతులు పండించిన పంట కొనుగోలు పూర్తిగా జరగలేదన్నారు. రైతులు వారి బాధలు చెప్పుకునేందుకు బీజేపీ భరోసాకు క్యూ కట్టారని వెల్లడించారు. సీఎం, మంత్రులు పరిపాలనను గాలికి వదిలి ఢిల్లీలో మకాం వేశారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి 18 నెలల్లో 45 సార్లు ఢిల్లీకి వెళ్లారన్నారు. భరోసాలో జాబ్ క్యాలెండర్ పై ఫిర్యాదులు వచ్చిందన్నారు.. వర్షాకాలం ముందే వచ్చిన రైతు బంధు రాకపోవడం బాధాకరమని తెలిపారు. మీ కుమ్ములాటలు పక్కన పెట్టి వెంటనే రైతు బంధు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## సంపాదకీయం

# ప్రకృతి విధ్వంసంతో అత్యంత ప్రమాదం!

ధర్మో రక్షతి రక్షితః..ఇది భారతీయ సనాతన ధర్మం చెబుతోంది. ధర్మాన్ని మనం కాపాడితే అది మనలను రక్షిస్తుంది. అలాగే ప్రకృతిని మనం కాపాడుకుంటేనే మనకు మనుగడ ఉంటుంది. భారతీయ సనాతన ధర్మం అంతా ప్రకృతిని పూజించడం, జీవ వైవిధ్యం గురించి వివరించడం జరిగింది. గాలి,నీరు, భూమి, ఆకాశం, అగ్ని అని పంచభూతాలను పూజించాలన్నది అందుకే. అంటే ఇవి మనిషి మనుగడకు తోడ్పడుతాయి కనుక వాటిపట్ల మనం కృతజ్ఞతగా ఉండాలని భారతీయ సంస్కృతి చెబుతోంది. అంటే పూజించడమనే కాదు..రక్షించడం..కాపాడుకోవడం అన్న పరమార్థం ఉంది. చెట్టును, పుట్టను పూజించడం వెనక ఉన్న మర్మం కూడా ఇదే. జీవవైవిధ్యం అనగా భూమిపైగల వివిధ రకాల జీవజాతులను రక్షించుకోవడం. జీవవైవిధ్యం కానాడుకుంటేనే భవిష్యత్ తరాలకు అపారమైన విలువ కలిగిన ఆస్తిని కాపాడిన వారం అవుతాం. అందుకు ప్రధానంగా పంచభూతాలను రక్షించడం అలవాటు చేసుకోవాలి. ప్రకృతి విధ్వంసం మొదలైన తరవాతనే మానవాళికి ముప్పు ఏర్పడిందని గుర్తించాలి. కరోనాలాంటి వైరస్ లు వచ్చినా తట్టుకునే స్థితిలో మనం లేమంటే..అందుకు మనం ప్రకృతిని నాశనం చేయడమేని తెలుసుకోవాలి. మానవ తప్పిదాల కారణంగా లేదా విధ్వంసం కారణంగా జీవజాతుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయి జీవవైవిధ్యం నశించి పోతోంది. జీవవైవిధ్యం ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని, జీవవైవిధ్యంపై ప్రజలలో అవగాహనను పెంచటానికి ఐక్యరాజ్యసమితి ప్రతి ఏటా మే22 న 'అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని' జరుపు కోవాలని నిర్ణయించింది. మనం పూజా పునస్కారాలతో మన ప్రకృతిని కాపాడుకునే ప్రయత్నం చేశాం. దీనిని తరవాతి తరం వారు ఈ పూజలేంటని విస్మరిస్తూ వచ్చారు. అంటే మనకు జీవనాధారంగా ఉన్న ప్రకృతి విధ్వంసానికి పాల్పడుతూ వస్తున్నాం. భారతీయ సంస్కృతిలో జీవవైవిధ్యాన్ని పూజించటం, దైవస్వరూపంగా భావించటం గొప్పవిషయం. అందులో భాగంగానే చెట్లు,చేమ, పశుపక్ష్యాదులను పూజించటం జరుగుతోంది. జీవవైవిధ్యంలోని జీవజాతులు వివిధ రకాల సేవలను, ప్రయోజనాలను మానవ జాతికి, పర్యావరణానికి అందిస్తాయి. ఉదాహరణకు మానవులు, ఇతర జీవజాతుల జీవనక్రియలో భూమిపై విడుదల అయ్యే వ్యర్థ పదార్థాలను భూమిలోని సూక జీవులు కృశింపచేసి భూమిని సారవంతం చేయుటలో కీలకపాత్ర పోషిస్తాయి. ఈ పర్యావరణ సేవలను కేవలం సూక జీవులు మాత్రమే నిర్వహించ గలవు. జామకాయ, ఆపిల్ , ఉసిరి, కూరగాయలు వంటివి ఆహారంగా పనికి వస్తాయి. అదేవిధంగా వేప, తులసి మొదలగువాటిని ఔషధాలుగా ఉపయోగపడుతున్నాయి. వివిధ జీవజాతులు ఒక నిర్దిష్టమైన పనికి లేదా పర్యావరణ సేవలకు ఉపయోగపడతాయి. అదేవిధంగా కొన్ని నిర్దిష్టమైన జంతువులు మాత్రమే మానవులు ఆహారంగా తినటానికి అనువైనవి. ఉదాహరణకు కోడిమాంసం, గొర్రె, పొట్టేలు మాంసం, జలచరాలు అయిన చేపలు మొదలగునవి తినటానికి అనువైనవి. ఇవి ఆరోగ్యానికి మంచిది. మానవ ఆహారం 80 శాతానికి పైగా మొక్కల ద్వారా అందుతోంది. ఆవు పాల ఉత్పత్తులు మానవ ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి. ఆయుర్వేద వైద్య విధానంలో ఆవుపాల ఉత్పత్తులకు విశిష్ట స్థానం కలదు. ముఖ్యంగా చిన్న పిల్లలకి ఆవుపాలు ఎంతో మేలుచేస్తాయి. ఆవు నెయ్యి మెరుగైన జీర్ణక్రియ, రోగనిరోధక శక్తిని పెంచటమే కాక ముఖ్యమైన విటమిన్లను కలిగి ఉంటుంది. ఆవు పాల ఉత్పత్తుల ను హిందూమత పూజా కార్యక్రమాలలో, శుభ కార్యక్రమాలలో విరివిగా వాడడానికి కారణం ఇదే. భారతీయ సంస్కృతిలో ఆవు ఒక భాగం. ఆవు జీవవైవిధ్యంలో అత్యంత ప్రయోజనకరమైన జంతువు. ఆవు పాలే కాదు దాని పేడ, మూత్రం కూడా ప్రకృతి పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తుంది. జీవవైవిధ్యంలో ప్రముఖ పాత్ర వహిస్తున్న ఆవును చంపి మాంసాహారంగా తీసుకోవడం వల్ల మన ప్రకృతిని మనమే ధ్వంసం చేస్తున్నాం. ఆవును పూజించాలన్న ఓ బృహత్తర కార్యక్రమం వెనక కేవలం జీవవైవిధ్య పాత్ర ఉందని చెప్పాలి. ఈ క్రమంలో పశుమాంసానికి అలవాటు పడడం వల్ల వాటి ఉత్పత్తి తగ్గిపోతోంది. పాలు ఇచ్చే సాధు జంతువులు అయిన గేదె,ఆవులు సంఖ్య తగ్గిపోవటం వలన డిమాండ్ కు తగినవిధంగా పాల ఉత్పత్తి ఉండటం లేదు. జీవవైవిధ్యం నశిస్తే మానవ జాతి కూడా నశిస్తుంది. పర్యావరణ సేవలు, ఆరోగ్య ప్రయోజనాలు, గ్రామీణ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతున్న పశువులను మాంసంగా వినియోగించరాదన్న డిమాండ్ వెనక ఉన్న పరామర్థాన్ని గుర్తించాలి. గోవును పూజించాలన్న పూర్వీకుల ఆచారం వెనక ఎంతటి పరిశోధన ఉందో గమరనించాలి. మాంసాహారం తప్పు కాదు. కానీ సమాజానికి అత్యంత అవసరమైన జంతువులను తినడం సరైనది కాదు. ప్రజలు జీవవైవిధ్యానికి ఏది ముఖ్యమో, ఆహారానికి ఏది అవసరమో శాస్త్రీయంగా ఆలోచించాలి. జీవవైవిధ్యం మనుగడ సాగించగలదు. తద్వారా మానవాళి భూమిపై ఆనందంగా జీవనం కొనసాగించగలదు. జీవవైవిధ్య విధ్వంసం వల్లనే కరోనా వైరస్ , సార్స్ , ఎబోలా వంటి వ్యాధులు జంతువుల నుంచి మానవులకు సంక్రమిస్తున్నాయి. జీవవైవిధ్యం కోల్పోతే లేదా విధ్వంసానికి గురయితే మానవులు ఆరోగ్యంతో సహా అన్నింటినీ కోల్పోతారు. కాబట్టి, జీవవైవిధ్యాన్ని కాపాడుకోవాలి. ప్రకృతి వనరులను కేవలం పారిశ్రామిక అవసరాలు తీర్చే వ్యాపార వస్తువులుగా చూడరాదు. మానవుని అనాలోచిత చర్యల వల్ల వాతావరణంలో కలుగుతున్న మార్పులు తోడయి, భూమ్మీద నివశిస్తున్న కోట్లాది జీవరాశుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ప్రకృతి వనరులను విచ్చలవిడిగా వినియోగించుకుంటూ, కలుషితాలను తిరిగి ప్రకృతిలోకి విడుదల చేయటం జరుగుతున్నది. నిత్యం పెద్దయెత్తున్న వెదజల్లబడుతున్న కలుషితాలు, విడుదలవుతున్న కర్బన ఉద్గారాల వల్ల భూవాతావరణం గతంలో ఎన్నడూ లేనంతగా వేడెక్కుతుంది. పెరుగుతున్న భూతాపం, భూమ్మీద నివశిస్తున్న సకల జీవరాశుల మనుగడను తీవ్ర సంక్షోభానికి గురి చేస్తుంది. అందుకే మానవ మనుగడలో అత్యంత కీలకమైన పాత్రను పోషించిన జీవరాశలను రక్షించు కోవాల్సిన భాద్యత సమస్త మానవాళిపైన ఉంది. అభివృద్ధి పేరుతో మానవుడు సాగిస్తున్న పర్యావరణ వినాశకర కార్యక్రమాల వల్ల జీవవైవిధ్యం అత్యంత వేగంగా విధ్వంసానికి గురవుతున్నది. దీనికి మనమే రక్షకులుగా నిలవాలి. పర్యావరణాన్ని కాపాడాలి. ప్రకృతిని రక్షించుకోవాలి. అప్పుడే మానవమనుగడ సాగుతుంది.



# చీకటి అధ్యాయానికి ముగింపు దినం!

వైసీపీ అధినేత జగన్ జూన్ 4ని వెన్నుపోటు దినంగా పిలుపునివ్వడం చూస్తే, ఆయనకు ఓటు వేయని ప్రజలే ఆయనకు వెన్నుపోటు పొడిచారన్న అర్థం వస్తోంది. తన పాలనను ప్రజలు తిరస్కరించడాన్ని వెన్నుపోటుగా చిత్రించి ప్రజలనే దోషులుగా చిత్రించే ప్రయత్నం ఆయన చేస్తున్నారు. నిజానికి జూన్ 4 భారత ప్రజాస్వామ్యంలో మరో చీకటి అధ్యాయానికి ముగింపు పలికిన దినం. ప్రజల చేతుల్లో ఉన్న ఓటు శక్తి, పాలకుల పట్ల సమీక్ష హక్కు ఎంత బలంగా పనిచేస్తుందో మరోసారి నిరూపితమైన దినం.జూన్ 4 వ తేదీన తన పరాజయాన్ని జగన్ వెన్నుపోటు దినంగా చిత్రించడం అంటే ప్రజలను నేరం చేసిన వారి దృష్టితో చూడటమే. ప్రజలు వెన్నుపోటు పొడవలేదు. నమ్మి అధికారం ఇస్తే ఆయనే ప్రజలకు వెన్నుపోటు పొడిచారు. జూన్ 4 ప్రజాస్వామ్యం విజయం సాధించిన రోజు అని చెప్పాలి. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు.. మంచి పాలకులను ఎన్నుకొనే స్వేచ్ఛ ప్రజలకే ఉంది. ప్రజలు 2019లో జగన్ పార్టీకి 151 సీట్లు ఇచ్చారు అది వారి నమ్మకం. అదే ప్రజలు 2024లో అత్యధిక స్థానాలను తెలుగుదేశం కూటమికి ఇచ్చారు. అది వారి నిరాశకు ప్రతిఫలనం.

**అరాచకానికి పాతరేసిన దినం**

ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పు దైవోపదేశం లాంటిది. తను ఓటమి చెందితే అది ప్రజల వ్యతిరేకత కాదు, ప్రజలను వంచించిన పాలనకు చెల్లించిన తగిన మూల్యం. జగన్ పాపాలను అవినీతిని, అరాచకాన్ని పాతరేసిన దినం. రాజధాని లేకుండా, పరిశ్రమలు, ఉద్యోగాలు లేకుండా, ప్రాజెక్టులు లేకుండా, అభివృద్ధి నిలిపి వేసిన పాలనను ప్రజలు తిరస్కరించిన దినం ఆ రోజు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టిన పాలకులకు చరమ గీతం పాడిన దినం. అసమర్థులను, అరాచకులను ఓడించి ప్రజలు ఇచ్చిన అద్భుత తీర్పు నిజమైన ఓదార్పు.. మరి ఇక్కడ వెన్నుపోటు ఏమిటి? అది ప్రజల అభిప్రాయం, అనుభవం ఆధారంగా ఇచ్చిన తీర్పు మాత్రమే.

**ఈ జగన్నాటకాలు దేనికి?**

ఏ పార్టీనైనా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజలకు దగ్గరయే సరికొత్త కార్యక్రమాలు చెయ్యాలి. తప్ప జగన్నాటకాలు ఆడటం ఏమిటి? ఓటమికి కారణం తెలుసుకునే ప్రయత్నం చేయకుండా ప్రజలే వెన్నుపోటు పొడిచారని ప్రచారం చేస్తూ ప్రజల తీర్పును అపహాస్యం చేయడం దురదృష్టకరం. ప్రజలు ఎప్పుడూ విజ్ఞతతో, అనుభవంతో ఓటు వేస్తారు. పాలకులు ప్రజలను ఒకసారి మాత్రమే మోసం చేయవచ్చు కానీ పదేపదే మోసం చేయడం సాధ్యం కాదు. నిజానికి ప్రజలు వెన్నుపోటు పొడవలేదు.. జగన్ పాలనపై నమ్మకం పోయింది. ప్రజల తీర్పును వెన్నుపోటుగా చూపడం జగన్ ముఠా అజ్ఞానానికి, అహంకారానికి నిదర్శనం. జగన్ కి మళ్ళీ అధికారం ఇస్తే జరిగే పరిణామాలు ఏమిటో జనం తెలుసుకొని విజ్ఞత ప్రదర్శించి విపత్తు నివారించుకొన్నారు. రాష్ట్రంలో ప్రజల అభిమతం ఎలా పనిచేస్తుందో, పాలన మీద ప్రజల విజ్ఞత ఎలా పని చేస్తుందో నిరూపించిన దినం జూన్ 4. ఆయన ఎందుకు ప్రజలు తన పాలనపై ఆశ వదిలేసుకొన్నారో అర్థం చేసుకొని, ప్రజాస్వామ్య తీర్పును గౌరవించటం నిజమైన ప్రజా స్వామ్యం. జగన్ ఈ మార్గంలో ఆలోచించాలి.

**11 సీట్లు మిగిలాయ్**

అధికార మదంతో ధర్మాన్ని విస్మరించి అధర్మ పరిపాలన చేసిన జగన్ పై జనాగ్రహం కట్టలు తెంచుకుంది. గత ఎన్నికల్లో 151 సీట్లు ఒక్క వైసీపీనే గెలుచుకుంది. అయిదు ఏళ్ళు గడిచే సరికి మధ్యన ఉన్న అయిదు అదృశ్యమై 11 సీట్లు మాత్రమే మిగిలాయి. యువత, రైతులు, ఉద్యోగులు, మహిళలు, విద్యావంతులు, వ్యాపారులు, మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి, ఉన్నత వర్గాలకు చెందిన ప్రజలు అవినీతి, అసమర్ధ పాలనను చరమగీతం పాడారు. ప్రాంతాలతో నిమిత్తం లేకుండా ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తా, రాయలసీమ మొత్తం అన్ని ప్రాంతాల్లో ఒకే విధమైన విజయాన్ని కూటమి సాధించింది. ఆయన మంత్రి వర్గంలో ఉన్న 26 మంది మంత్రులలో 24 మంది ఘోర పరాజయం పాలయ్యారు. పాత 13 జిల్లాల్లో 8 జిల్లాలలో వైసీపీకి ఒక్క సీటూ కూడా దక్కలేదు.

**తమ తీర్పును తిరగరాసిన జనం**

గత ఎన్నికల ప్రచారంలో తనకు తాను అపర దాన కర్ణుడిగా బిరుదు తగిలించుకొని ఊరేగినా జగన్ నిజ స్వరూపాన్ని జనం తెలుసుకున్నారు. 2019లో ఇచ్చిన తీర్పును 2024లో తిరగరాశారు. పాలకులు ఎలా ఉండకూడదో తమ తీర్పు ద్వారా రుజువు చేశారు. ఎలాంటి వారు ముఖ్యమంత్రి అవకూడదో ఆంధ్రప్రదేశ్ ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారు. శాసనసభను కౌరవ సభగా మార్చి తనను తీవ్రంగా అవమానించిన సభలోకి మళ్లీ ముఖ్యమంత్రిగానే అడుగుపెడతానని చంద్రబాబు చేసిన శపథంలోని ధర్మా గ్రహాన్ని ప్రజలు అర్థం చేసుకొని చంద్రబాబుని మళ్లీ ముఖ్యమంత్రిని చేశారు. అయిదు కోట్ల ఆంధ్రులు అందించిన అద్భుత విజయం అది. ఓటర్లు సృష్టించిన ఆ నిశ్శబ్ద విప్లవంలో ప్రజలు గెలిచారు, రాష్ట్రం నిలబడింది.

# ఇంతకూ ధర్మాసనం ఎందుకు

న్యాయస్థానాల్లో పెండింగ్ కేసులు, కేంద్ర రాష్ట్ర కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్ళు, పరిపాలన సంబంధిత నిబంధనల నిర్వహణ... ఇవన్నీ ప్రజలకు తక్షణం పరిష్కారం కావాల్సిన అవసరాలు. ఇటీవల బిల్లుల ఆమోదంపై రాష్ట్రపతికి, గవర్నర్లకు కాలపరిమితిని సూచిస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. ఇది కొత్త ఆలోచన కాదు. హోంమంత్రిత్వ శాఖ మార్గదర్శకాల్లోనే ఉంది. హోంమంత్రిత్వ శాఖే సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ విచారణలో బిల్లుల ఆమోదంపై గడువును నిర్ణయించాలని అన్నది. ఇప్పుడు మళ్లీ సుప్రీం తీర్పుపై వివరణ కోరుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్మ సుప్రీంకోర్టుకు 14 ప్రశ్నలు సంధించారు. గడువు అవసరాన్ని ప్రభుత్వమే ఒప్పుకున్న తర్వాత మరలా ఆ గడువుకు సంబంధించిన తీర్పు మీదనే సుప్రీంకోర్టుకే 14 రెఫెరెన్స్ లు ఎందుకు? అందుకోసం సుప్రీంకోర్టు ప్రత్యేక ధర్మాసనం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇటూ అటూ లాయర్లు సుదీర్ఘ కాలం నడిపిస్తారు. చివరకు సుప్రీంకోర్టు ఏ నిర్ణయం తీసుకున్నా, ‘‘మాకిష్టం లేదు. మేం ఒప్పుకోం,’’ అనే అధికారం కేంద్ర ప్రభుత్వానికే ఉందని రాజ్యాంగంలోనే మనం రాసుకున్నాం. అలాంటప్పుడు ఇదంతా వృథా కాదా?2024 ఏప్రిల్ 8న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో: ‘‘మేము కేవలం హోం మంత్రిత్వ శాఖ 2016లో జారీ చేసిన మెమొరండమ్ రూపంలోని మార్గదర్శకాలను అనుసరిస్తున్నాం, అవి మూడు నెలల గడువును సూచించాయి’’ అని పేర్కొంది. అంటే ఈ కాల పరిమితిని మొదట కేంద్ర ప్రభుత్వమే సూచించింది. అటువంటప్పుడు మళ్ళీ సుప్రీంకోర్టు విచారణ అవసరం ఎందుకు?భారత రాష్ట్రపతి దేశ పాలనలో రాజ్యాంగ అత్యున్నత పదవిలో ఉన్నారు. రాష్ట్రపతి ఎన్నిక కార్యక్రమంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు ఓటింగ్ చేస్తారు. దేశవ్యాప్తంగా అత్యంత విశాలమైన ప్రజాతంత్ర ప్రాతినిధ్యం కలిగి ఉంటుంది. అందుకే ఆ పదవికి గౌరవం. గవర్నర్లను రాష్ట్రపతి ద్వారా ప్రధానమంత్రి, మంత్రివర్గ సిఫార్సు మేరకు నియమిస్తారు. ఇది ఎన్నిక కాదు. వారు చేసే ఎంపిక. ఆయా రాష్ట్రాల్లో గవర్నర్లకు అత్యున్నత పరిపాలనాధికారాలు ఉంటాయి. వాటిని దుర్వినియోగం చేయకూడదు. బాధ్యతాయుతంగా పనిచేయాలి. కానీ ఇది జరగటం లేదు. ఇది కేవలం తమిళనాడు సమస్యేకాదు, ఎన్డీయేతర రాష్ట్రాలన్నిటిలోనూ ఈ సమస్య ఉంది. ఆర్టికల్ 200, 201లో కాల పరిమితులు లేకపోవటం తప్పుగా పరిగణించాల్సిన అవసరం లేదు. కానీ పరిపాలనలో సమయానుకూల నిర్ణయాలు కీలకం. గవర్నర్లు ఈ బాధ్యతను విస్మరించరాదు. తాము సంప్రదాయ పరిపాలనా అధికారం కలిగి నప్పటికీ, నిర్ణయాలు ఆలస్యం చేయకూడదు. సుప్రీంకోర్టు తీర్పు అందరు గవర్నర్లకు వర్తిస్తుంది. గవర్నర్ – ముఖ్యమంత్రుల మధ్య ప్రతి రాష్ట్రంలోనూ గొడవ ఉండదు. కేంద్రంలో రాష్ట్రాల్లో వేరే పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ఈ ఆలస్యాలు కావాలని చేస్తున్నట్టు కనపడుతూనే ఉంది. ఈ కారణంగా రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు చేసుకోలేక పరిపాలన స్తంభించిపోతున్నది. తమిళనాడు వెర్సస్ గవర్నర్ ఆఫ్ తమిళనాడు (2025) కేసులో గవర్నర్ ‘పాకెట్ వీటో’ వాడుతున్నారని తీవ్ర విమర్శలు వచ్చాయి. ‘పాకెట్ వీటో’ అంటే బిల్లులను నిరవధికంగా పెండింగ్ లో ఉంచటం.రాష్ట్రపతి వేసిన ఐదు కీలక ప్రశ్నలు ఇవే: 1) ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్ అధికారాలు న్యాయపరంగా పరిశీలించదగినవేనా? 2) ఆర్టికల్ 361 ప్రకారం గవర్నర్/ రాష్ట్రపతి పూర్తిగా న్యాయ సమీక్షకు అతీతమా? 3) రాజ్యాంగ కాలపరిమితి లేకపోతే గవర్నర్ బిల్లుపై నిర్ణయం తీసుకోవడం ఏ విధంగా జరగాలి? 4) ఆర్టికల్ 201 ప్రకారం రాష్ట్రపతి చేసే నిర్ణయాలు న్యాయపరంగా సమీక్షించదగినవేనా? 5) ఆర్టికల్ 201 ప్రకారం బిల్లులపై రాష్ట్రపతికి గడువు విధించవచ్చా? ఉందనుకుంటే సుప్రీంకోర్టు గడువులు ఇవ్వవచ్చా?రకరకాల అనుమానాలు: 1) ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్ కి నిర్ణయాల విచక్షణాధికారాలు ఉన్నాయా? గవర్నర్ రాష్ట్ర కేబినెట్ సలహా మేరకే పనిచేయాలా? అప్పుడు రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహా తీసుకోవచ్చా? 2) ఆర్టికల్ 142 ప్రకారం కోర్టులు గవర్నర్/ రాష్ట్రపతిని తొలగించే ఆదేశాలు ఇవ్వగలవా? 3) గవర్నర్ అంగీకారం లేకుండా రాష్ట్ర శాసనసభ ఆమోదించిన చట్టం చట్టబద్ధమా? 4) ఈ అంశంపైన ఆర్టికల్ 145(3) ప్రకారం కనీసం ఐదుగురు న్యాయమూర్తులతో రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేయాల్సిన అవసరముందా? 5) ఆర్టికల్ 131 ప్రకారం ఒరిజినల్ సూట్ లేకుండా కేంద్రం – రాష్ట్రాల మధ్య విభేదాలను సుప్రీంకోర్టు పరిష్కరించగలదా?న్యాయమూర్తి పార్థివాలా అభిప్రాయం ప్రకారం గవర్నర్ కు ఒక బిల్లు వచ్చాక... మూడు మార్గాలు మాత్రమే ఉంటాయి. ఒకసారి బిల్లు తిరిగి శాసనసభకి పంపి, అదే రూపంలో తిరిగి వస్తే రాష్ట్రపతికి పంపించే హక్కు గవర్నర్ కు ఉండదు. ఆయన సూచనల మేరకే మార్పులు జరిగితే తప్ప. గవర్నర్ లేదా రాష్ట్రపతి బిల్లులపై జాప్యం చేస్తే ఆ ప్రభుత్వాలు కోర్టులో మాండమస్ రిట్ వేయవచ్చు. బిల్లుల ఆమోదంపై సుప్రీంకోర్టు తీర్పు దిశను సూచించినప్పటికీ, తుది స్పష్టత కోసం రాజ్యాంగ ధర్మాసనం అవసరమే. కానీ ఆర్టికల్ 143 ప్రకారం, సుప్రీంకోర్టు ఇచ్చే సలహాను ప్రభుత్వం పాటించాల్సిన అవసరం లేదు. ఈలోగా మంత్రిత్వ శాఖల ఆమోదానికి పంపిన బోలెడు బిల్లులు ఎక్కడివక్కడే ఆగిపోతాయి. ఇది ప్రజల పాలనపై హక్కును దారుణంగా ఉల్లంఘించటమే.

# వ్యవసాయాన్ని పరిశ్రమగా గుర్తించాలి!

వ్యవసాయ రంగంలో కీలక మార్పులు వస్తున్నాయి. రైతులు కూడా ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులను గమని స్తున్నారు. కొత్త తరహా సేద్యానికి అలవాటు పడుతున్నారు.. కేవలం వరిపైన ఆధారపడకుండా పళ్ల తోటల పెంపకం పాడి పశువుల పెంపకం పైన శ్రద్ధ పెడుతున్నారు. ఈ క్రమంలో రైతులకు మరింత ఆసరా దక్కాలంటే బ్యాంకులు రుణాలు ఇవ్వాలి. పంటలకు అనుకూలంగా ప్రభుత్వ విధానాలు మారాలి. చిన్న చిన్న సహాయాలు చేస్తే రైతాంగం మరింత కష్టపడి దేశంలో పురోభివృద్ధికి భాగ స్వామ్యం కాగలదు.

**తెలుగు రాష్ట్రాల్లో ధాన్యరాశులు..**

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ధాన్యం దిగుబడులు భారీగా పెరిగాయి.. ఈ రెండు రాష్ట్రాల్లో ముందు నుంచి పంటల దిగుబడి పెరుగుతూనే వస్తుంది. అయితే రైతులు చెమటోడ్చి పంటలు పండించినా ఆర్థికంగా మాత్రం ఎదగడం లేదు. పంటలు బాగా పండాయనడానికి నేటి ధాన్యరాశులే నిద ర్శనం. ధాన్యం కొనుగోళ్ల కోసం రైతులు ఎదురు చూస్తున్న దృశ్యాలు చూస్తుంటే ఎంత ధాన్యం దిగుబడి అయిందో గమనించాలి. ఓవైపు జోరుగా కొనుగోలు సాగుతున్నా మరోవైపు తమ ధాన్యం కొనడం లేదని రైతుల ఆందోళనలు పెరిగాయి. ఉచిత విద్యుత్ కి తోడుగా అందుబాటులో నీరు ఉండడంతో జిల్లాల్లో ధాన్యం దిగుబడులు పెరిగాయి.

**దిగుబడిలో నంబర్ వన్ రాష్ట్రం!**

కాళేశ్వరం నీళ్లు లేకున్నా పంటల దిగుబడి పెరిగిందని మంత్రులు ప్రకటిస్తున్నారు. ధాన్యం దిగుబడిలో ఇప్పటికే తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందని చెబుతున్నారు. దిగుబడి ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని భారత ఆహార సంస్థ గతంలో ప్రకటించింది. తెలంగాణ ధాన్యాగారంగా మారడానికి అన్నదాతలు పడ్డ కష్టాలను అభినందించాల్సిందే. దేశంలో ఏ రాష్ట్రం కూడా తెలంగాణ మాదిరిగా ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదు. గ్రామాల్లోనూ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనడం ద్వారా సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది.

**పంట మార్పిడి తప్పదు..**

ఈ దశలో వ్యవసాయంలో మరో విప్లవాత్మక మార్పునకు తెలంగాణ సర్కారు దృఢ నిశ్చయంతో ఉంది. కృష్ణా, గోదావరి, మూసీ నది జలాలు పుష్కలంగా లభిస్తున్న తరుణంలో పంట మార్పిడి దిశగా నియంత్రిత సాగు విధానాన్ని అమలు చేయాలని భావిస్తోంది. గిరాకీ ఉన్న పంటలు పండించడం, డిమాండ్ ఉన్నప్పుడే పంటను మార్కెట్ కు తేవడం నియంత్రిత వ్యవసాయ లక్ష్యం. రాష్ట్ర ప్రభుత్వం రైతులను మూస విధానం వీడి ఆదాయం పొందేలా మేథు మధనం జరిపి జిల్లా నేలలకు అనువైన పంటలు వేసి లాభాలు గడిచేలా ప్రణాళిక రూపొందించింది.

**దేశానికి అన్నపూర్ణగా తెలంగాణ**

ఒకే రకమైన పంటల సాగుతో ధరలు తగ్గి రైతులు నష్టపోతున్న నేపథ్యంలో డిమాండ్ ఉన్న పంటలు పండించ



డానికి రైతులు కూడా మొగ్గు చూపుతున్నారు. అవసరం ఉన్న పంటలను పండించాలన్న లక్ష్యంతో వ్యవసాయ రంగం బహుముఖంగా అభివృద్ధి చెందుతుంది. కరోనా కష్టకాలంలో ధాన్యాగారంగా యావత్ దేశానికి అన్నపూర్ణగా తెలంగాణ అవతరించింది. అయితే ఉభయ రాష్ట్రాల్లో కరువులు, వరదల కారణంగా కొండంత కష్టాలతో కుమిలిపోయిన అన్నదాతల జీవితాలు మాత్రం గట్టెక్కడం లేదు. రైతు భరోసా పెట్టుబడి సాయం, 24 గంటలపాటు కరెంటు సరఫరా అవుతున్నా అనేక కష్టాలు పడాల్సి వస్తుంది. రైతుకు ఇతోధికంగా ప్రోత్సాహకాలు అందించినప్పుడే పంటల దిగుబడికి మరింత సానుకూల వాతావరణం ఏర్పడుతుంది.

# ట్రంప్ సర్కార్‌పై మస్క్ వ్యతిరేక గళం

- ట్రంప్ సర్కార్‌పై మస్క్ వ్యతిరేక గళం
- ట్యాక్స్ బిల్లుపై విమర్శలు ట్రంప్ నిర్ణయంలో మార్పు ఉందన్న వైట్‌హౌస్



**అమెరికా :** అమెరికా అధ్యక్షుడు ట్రంప్-ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మధ్య విభేదాలు తలెత్తినట్లుగా తెలుస్తోంది. తాజాగా ట్రంప్ సర్కార్ పై మస్క్ నిరసన గళం విప్పారు. ఇటీవల ట్రంప్ ప్రభుత్వం తీసుకొచ్చిన ట్యాక్స్ బిల్లుకు వ్యతిరేకంగా మస్క్ వ్యతిరేక గళం విప్పారు. ఇది చెడ్డ బిల్లు అని.. దీని కారణంగా అమెరికన్లపై అధిక భారం పడుతుందని విమర్శించారు.ట్రంప్ సర్కార్ తీసుకొచ్చిన బిల్లును మస్క్ వ్యతిరేకిస్తూ ఎక్స్ లో ట్వీట్ చేశారు. "నన్ను క్షమించండి. నేను ఇంతకంటే భరించలేను. ఇది అత్యంత దారుణమైనది. కాంగ్రెస్ లో తీసుకొచ్చిన బిల్లు చాలా చెడ్డది. అది తప్పు అని మీకు తెలుసు. అయినా ఈ బిల్లుకు అనుకూలంగా ఓటు వేశారంటే అది మీకే అవమానం" అని రాసుకొచ్చారు. అమెరికా ద్రవ్యలోటు 2.5 బిలియన్ డాలర్లకు చేరుతుందని.. ఇలాగే కొనసాగితే అమెరికా దివాళా తీయడం ఖాయమనే మస్క్ అభిప్రాయం వ్యక్తం చేశారు.ఇక ఎలాన్ మస్క్ చేసిన ఆరోపణలను వైట్ హౌస్ ఖండించింది. మస్క్ వ్యాఖ్యలతో ట్రంప్ అభిప్రాయాన్ని మార్చదని తేల్చిచెప్పింది. రానున్న బిల్లు గొప్పదని.. దానికి కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. మస్క్ చేసిన వ్యాఖ్యలు తనను నిరాశపరిచాయని హౌస్ స్పీకర్ మైక్ జాన్సన్ పేర్కొన్నారు.శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ట్రంప్ ఈ చట్టాన్ని ప్రశంసించారు. ఈ బిల్లు మీ లోటును తగ్గించే బిల్లు అని పేర్కొన్నారు. పన్నులతో పెద్ద కోతను తాను ఇష్టపడతానని చెప్పారు. ఈ విలేకర్ల సమావేశంలో అప్పుడు మస్క్ పక్కనే ఉన్నారు. కానీ అప్పుడు మస్క్ స్పందించలేదు. తాజాగా వ్యతిరేకంగా వ్యాఖ్యాలు చేశారు. ఇక ఈ బిల్లును రిపబ్లికన్లు కూడా వ్యతిరేకిస్తున్నారు. దీనిపై పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు.

# టూరిస్ట్ రాజాది హత్యగా తేల్చిన పోలీసులు..

- మేఘాలయ హనీమూన్ జంట మిస్సింగ్‌లో అప్‌డేట్
- టూరిస్ట్ రాజా రఘువంశీది హత్యగా తేల్చిన పోలీసులు
- భార్య సోనమ్ ఆచూకీ కోసం గాలింపు



**మధ్యప్రదేశ్ :**మేఘాలయ హనీమూన్ కు వెళ్లి అదృశ్యమైన జంటలో భర్త రాజా రఘువంశీ మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతడి భార్య సోనమ్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. వాతావరణం అనుకూలించకపోవడంతో రెస్క్యూ ఆపరేషన్ కు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.అయితే తాజాగా రాజా రఘువంశీది హత్యగా మధ్యప్రదేశ్ పోలీసులు తేల్చారు. మృతదేహం లభ్యమైన సమీపంలోనే హత్యకు ఉపయోగించిన ఆయుధం, అలాగే నిందితుడి మొబైల్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ హత్య ఈశాన్య రాష్ట్రాన్ని షాక్ కు గురిచేసిందని పోలీసు అధికారులు తెలిపారు. ఇక బాధితుడి భార్య సోనమ్ ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు స్పష్టం చేశారు.మధ్యప్రదేశ్ కు చెందిన జంట రాజా రఘువంశీ, సోనమ్ రఘువంశీకి మే 11న వివాహం జరిగింది. హనీమూన్ కోసం మే 20న మేఘాలయకు వెళ్లారు. మే 23 నుంచి జంట ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది పోలీసులకు సమాచారం అందించారు. తూర్పు ఖాసీ హిల్స్ జిల్లాలో కనిపించకుండా పోయారు. సమాచారం అందిన దగ్గర నుంచి మేఘాలయ పోలీసులు, రెస్క్యూ సిబ్బంది జంట కోసం వెతికారు. ప్రతికూల వాతావరణంలో కూడా అధికారులు అన్వేషణ సాగించారు. ఎట్టకేలకు రియాట్ అర్లియాంగ్ దగ్గర లోతైన లోయలో రాజా రఘువంశీ మృతదేహాన్ని డ్రోన్ ద్వారా గుర్తించారు. రాజా రఘువంశీ మృతదేహాన్ని వీసావ్ డాంగ్ పార్కింగ్ స్థలానికి తీసుకురాగానే కుటుంబ సభ్యులు, బంధువులు.. అతని కుడి చేతిపై ఉన్న 'రాజా' అని పేరున్న పచ్చబొట్టు ద్వారా గుర్తించారు. అయితే శరీరంపై గాయాలు ఉండడంతో హత్యకు పరిగణించారు. అయితే సోనమ్ ఏమైందన్న ఉత్కంఠ చోటుచేసుకుంది. ఆమెను చంపేశారా? లేదంటే కిడ్నాప్ చేశారా? అన్న విషయం తేలాల్సి ఉంది. ఇక నిందితుల కోసం కూడా గాలిస్తున్నారు.ఇక రాజా రఘువంశీ మృతదేహం దగ్గర కొన్ని వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఒక మహిళ తెల్ల చొక్కా.. పెంట్రా 40 మందుల స్ట్రిప్, వివో మొబైల్, ఎల్ సీడీ స్క్రీన్ భాగం, స్మార్ట్ వాచ్ స్వాధీనం చేసుకున్నారు.అయితే ఈ కేసును కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ దర్యాప్తు చేయాలని బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. వాహనం అద్దెకు తీసుకున్న 25 కిలోమీటర్ల దూరంలో రాజా మృతదేహం గుర్తించారని.. అంటే ఎవరో కిడ్నాప్ చేసి ఉంటారని ముందే ఆలోచించినట్లు సోదరుడు విపిన్ రఘువంశీ తెలిపారు. కొత్త జంట ఆత్మహత్య చేసుకునే అవకాశం లేదని ముందు నుంచి చెబుతూనే ఉన్నట్లు చెప్పారు. కానీ తన వాదనను పోలీసులు పట్టించుకోలేదన్నారు. సీబీఐ దర్యాప్తు చేయాలని కోరారు. జంట ఆచూకీ చెబితే రూ.5లక్షల ఇస్తామని కుటుంబ సభ్యులు ఇప్పటికే ప్రకటించారు.ఇక ఈ ఘటనపై రాష్ట్ర పర్యాటక మంత్రి పాల్ లింగ్డో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దర్యాప్తు పూర్తయ్యేంత వరకు ప్రజలు ఓపిక పట్టాలని కోరారు. ఈ ఘటనతో షాక్ అయినట్లు చెప్పారు. గతంలో ఎప్పుడూ ఇలాంటివి జరగలేదన్నారు. పూర్తి వివరాలు తెలుసుకున్నాక.. మీడియాకు తెలియజేస్తామని చెప్పారు.

# సత్యేంద్ర జైన్, మనీష్ సిసోడియాలకు ఏసీబీ సమన్లు

- సత్యేంద్ర జైన్, మనీష్ సిసోడియాలకు ఏసీబీ సమన్లు
- ఢిల్లీ తరగతి గదుల కుంభకోణం కేసులో నోటీసులు



**ఢిల్లీ :** ఢిల్లీ తరగతి గదుల కుంభకోణం కేసులో మాజీమంత్రులు మనీష్ సిసోడియా, సత్యేంద్ర జైన్ లకు ఏసీబీ సమన్లు జారీ చేసింది. రూ.2,000 కోట్ల కుంభకోణం జరిగినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. జూన్ 6న హాజరుకావాలని సత్యేంద్ర జైన్ కు, జూన్ 9న హాజరుకావాలని మనీష్ సిసోడియాకు సమన్లలో ఏసీబీ పేర్కొంది.ఈ ప్రాజెక్ట్ ను అప్పటి ఆప్ ప్రభుత్వం 34 మంది కాంట్రాక్టర్లకు అప్పగించింది. వీరిలో ఎక్కువ మంది ఆప్ తో అనుబంధంగా ఉన్నవారే ఉన్నారని ఆరోపణలు ఉన్నాయి. బీజేపీ అధికార ప్రతినిధి హరీష్ ఖురానా, బీజేపీ ఎమ్మెల్యే కపిల్ మిశ్రా, బీజేపీ మీడియా రిలేషన్స్ విభాగం నుంచి నీలకాంత్ బక్షి దాఖలు చేసిన ఫిర్యాదు మేరకు ఏసీబీ ఈ చర్య తీసుకుంది. సెమీ-పర్మనెంట్ తరగతి గదుల నిర్మాణంలో ఖర్చులు పెరగడం, అవకతవకలు జరిగాయని ఫిర్యాదులో ఆరోపించారు. రూ.2,000 కోట్ల కుంభకోణం జరిగిందని బీజేపీ ఆరోపించింది.ప్రాజెక్ట్ చేపట్టినప్పుడు ఒక అంచనా. ప్రాజెక్ట్ చేపట్టాక తరగతి గది నిర్మాణం అమాంతంగా పెరిగిపోయింది. మార్కెట్ రేటు కంటే అదనంగా పెరిగిపోయినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. రూ.2,892 కోట్ల అంచనా వ్యయంతో సుమారు 12,748 తరగతి గదులను నిర్మించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. టెండర్ల ప్రకారం ఒక్కో తరగతి గదికి రూ.24.86 లక్షలు ఖర్చయింది. ఇది అంచనా వేసిన మార్కెట్ రేటు రూ.5 లక్షల కంటే దాదాపు ఐదు రెట్లు ఎక్కువ అయినట్లుగా ఆరోపించింది. ఈ ప్రాజెక్టును 34 మంది కాంట్రాక్టర్లకు అప్పగించారని, వీరిలో ఎక్కువ మంది ఆప్ తో ముడిపడి ఉన్నారని చౌహాన్ తెలిపారు.2015-16 సమావేశాల్లో ఖర్చు ఫైనాన్స్ కమిటీ ఈ ప్రాజెక్టును కఠినమైన షరతుతో ఆమోదించిందని ఏసీబీ చీఫ్ మధుర్ వర్మ మీడియాకు తెలిపారు. జూన్ 2016 నాటికి మంజూరు చేయబడిన ఖర్చులోనే దీనిని పూర్తి చేయాలని.. భవిష్యత్తులో ఎటువంటి పెరుగుదలకు అవకాశం లేదన్నారు. అయితే దర్యాప్తులో ఆర్థిక ప్రణాళిక ఉల్లంఘన జరిగినట్లు తెలిసిందన్నారు. ఈ కేసు ప్రస్తుతం దర్యాప్తులో ఉందని.. ఆప్ నాయకులు త్వరలో హాజరుకానున్న తర్వాత తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని వెల్లడించారు.

# భారత్ దౌత్య బృందాన్ని అడ్డుకునేందుకు పాక్ కుట్ర..


- భారత్ దౌత్య బృందాన్ని అడ్డుకునేందుకు పాక్ కుట్ర
- తిప్పికొట్టిన మలేషియా ప్రభుత్వం



**న్యూఢిల్లీ :** పాకిస్థాన్ తీరును అంతర్జాతీయంగా ఎండగట్టేందుకు భారతదేశానికి చెందిన ఏడు దౌత్య బృందాలు ఆయా దేశాల్లో పర్యటిస్తున్నాయి. దాయాది దేశం యొక్క ఉగ్రవాద వైఖరిని ప్రపంచ నేతలకు వివరిస్తున్నాయి. అయితే జేడీయూ ఎంపీ సంజయ్ ఝా నేతృత్వంలోని ప్రతినిధి బృందం.. అపరాజిత సారంగి, బ్రిజ్ లాల్, ప్రధాన్ బారువా, హేమంగ్ జోషి, కాంగ్రెస్ నేత సల్మాన్ ఖుర్షీద్, టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీ, సీపీఐ నేత జాన్ బ్రిట్టాస్, మాజీ రాయబారి మోహన్ కుమార్ మలేషయాలో పర్యటించడానికి సిద్ధపడుతుండగా పాకిస్థాన్ అడ్డుకునే ప్రయత్నం చేసింది."మనది ఇస్లామిక్ దేశం.. మీరు ఇస్లామిక్ దేశం... భారత ప్రతినిధి బృందం మాట వినకండి. మలేషియాలో వారి కార్యక్రమాలను రద్దు చేసుకోండి." అని మలేషియాను పాకిస్తాన్ రాయబార కార్యాలయం కోరింది. కానీ అందుకు మలేషియా ప్రభుత్వం తిరస్కరించింది. పాకిస్థాన్ ప్రతిపాదనను తోసిపుచ్చింది. దీంతో దాయాది దేశానికి చెంపదెబ్బ కొట్టినట్లైంది. భారత దౌత్య బృందానికి పూర్తి మద్దతు లభించింది. అన్ని కార్యక్రమాలను భారత బృందం యథావిధిగా కొనసాగించింది.ఈ బృందం అప్పటికే జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్, ఇండోనేషియాలో పర్యటించింది. చివరి పర్యటన మలేషియానే. శనివారమే మలేషియా రాజధాని కౌలాలంపూర్ చేరుకుంది. ఇంతలోనే పాకిస్థాన్ కుట్ర పన్నింది. భారతదేశం పంపించిన ఉద్దేశాలను ఆయా దేశాధినేతలకు వివరించినట్లు దౌత్య బృందం తెలిపింది. ప్రపంచ దేశాలన్ని ఉగ్రవాదాన్ని తీవ్రంగా ఖండించాయని చెప్పుకొచ్చారు.ఇక ఆయా దేశాలకు వెళ్లిన దౌత్య బృందాలతో తిరిగి వచ్చాక ప్రధాని మోదీ అఖిలపక్ష ప్రతినిధుల బృందాన్ని కలిసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశం జూన్ 9 లేదా 10న జరిగే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్ర దాడిలో 26 మంది చనిపోయారు. అనంతరం భారత్.. పాకిస్థాన్ పై ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం.. పాకిస్థాన్ వైఖరిని ఎండగట్టేందుకు అన్ని పార్టీలతో కూడిన దౌత్య బృందాలను విదేశాలకు పంపించింది.

# పాక్‌లో 9 విమానాలు ధ్వంసం!

- ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌లో 9 విమానాలు ధ్వంసం!
- ఉపగ్రహ చిత్రాల ద్వారా దృశ్యాలు వెలుగులోకి



**న్యూఢిల్లీ :** పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా మే 7న భారత్ .. పాకిస్థాన్ పై ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఈ ఆపరేషన్ లో 100 మంది ఉగ్రవాదులు హతం కాగా.. పాకిస్థాన్ వైమానిక స్థావరాలు నాశనం అయ్యాయి. తాజాగా పాకిస్థాన్ కు చెందిన 9 విమానాలు ధ్వంసం అయినట్లుగా సమాచారం అందుతోంది. వైమానిక స్థావరాలతో పాటు సైనిక ఆస్తులకు భారీగా నష్టం వాటిల్లినట్లు వర్గాలు పేర్కొంటున్నాయి.పాకిస్థాన్ వైమానిక దళానికి చెందిన ఆరు యుద్ధ విమానాలు, రెండు ఖరీదైన నిఘా విమానాలు, పదికి పైగా సాయుధ డ్రోన్లు, ఒక సీ -130 పెర్క్యులస్ రవాణా విమానం ధ్వంసం అయినట్లు వార్తలు వినిపిస్తున్నాయినాలుగు రోజుల పాటు సాగిన ఆపరేషన్ సిందూర్ లో అధిక విలువ కలిగిన రెండు ఎయిర్ బోర్న్ విమానాలు నాశనం అయినట్లు సమాచారం. ఇక పాకిస్థాన్ భోలారి వైమానిక స్థావరంలో ఉంచిన స్వీడిష్ మూలానికి చెందిన మరో ఏఈడబ్లయూసీ విమానం.. ఉపరితల క్రూయిజ్ క్షిపణి దాడిలో ధ్వంసమైందని తెలుస్తోంది. ఇది పూర్తిగా ధ్వంసమైనట్లు ఉపగ్రహ చిత్రాల ద్వారా అర్థమవుతోంది.ఇక పాకిస్థాన్ పంజాబ్ పై లక్ష్యంగా చేసుకున్న డ్రోన్ దాడిలో పీఏఎఫ్ సీ-130 హెర్క్యులస్ విమానం ధ్వంసమైనట్లు ప్రత్యేక ఆపరేషన్ లో తేలింది. ఈ C-130 విమానం లాజిస్టికల్ సపోర్ట్ కోసం ఉపయోగించబడుతుంది. డ్రోన్ దాడి జరిగినప్పుడు ముల్తాన్ సమీపంలోని ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్ దగ్గర నిలిపి ఉంచారని వర్గాలు తెలిపాయి.పహల్గామ్ ఉగ్ర దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. అనంతరం భారత్ కఠిన నిర్ణయాలు తీసుకుంది. సింధు జలాలు నిలిపేసింది. వీసాలను రద్దు చేసింది. అటారీ సరిహద్దు నిలిపేసింది. ఇక మే 7న ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఈ దాడిలో 100 మంది ఉగ్రవాదలు హతమయ్యారు. అంతేకాకుండా పాకిస్థాన్ వైమానిక స్థావరాలు ఘోరంగా దెబ్బతిన్నాయి. దీంతో దాయాది దేశం కాళ్ల బేరానికి రావడంతో భారత్ కాల్పుల విరమణకు అంగీకరించింది.

# ప్రియురాలిని హతమార్చి..






**చెన్నై:** స్థానిక పెరంబూరు రాజీవ్ గాంధీ నగర్ లో ఓ ఇంట్లో అద్దెకు దిగిన ప్రేమ జంట అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ప్రియుడే ఆ యువతిని హతమార్చి, తాను కూడా ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి... విల్లుపురం జిల్లా తిరువెన్నెనల్లూరు ప్రాంతానికి చెందిన ఆకాష్ (19)బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అదే జిల్లాకు చెందిన అభినయ (19) ఆకాష్ చదువుతున్న కళాశాలలోనే చదువుతోంది.ఒకే కళాశాలలో చదువుతుండటంతో వారిద్దరి మధ్య ఏర్పడిన పరిచయం కాస్తా ప్రేమగా మారింది. ఈ నేపథ్యంలో పదిహేను రోజుల క్రితం వారిద్దరూ పెరంబూరులో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నారు. వారం రోజులపాటు ఏ గొడవ లేకుండా సంతోషంగా గడిపిన వారి మధ్య ఉన్నట్టుండి మనస్పర్థలు ఏర్పడయ్యాయి. తరచూ రాత్రిపూట గొడవపడుతుండేవారు. ఆ విధంగానే సోమవారం రాత్రి కూడా ఇద్దరూ గొడవపడ్డారు. కాసేపటికి శబ్దాలు ఆగిపోయాయి. చుట్టుపక్కల వారు అనుమానంతో కిటికీ నుండి లోపలికి చూడగా ఆకాష్ ఉరికి వేలాడుతూ కనిపించాడు.వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని ఇంటి తలుపులు పగులగొట్టి లోపలికెళ్లి చూడగా, అభినయ శరీరంపై గాయాలతో రక్తపుమడుగులో పడి వుంది. ఆకాష్ ఉరేసుకుని మృతి చెందాడు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించారు.. ఐసీఎఫ్ పోలీసుల ప్రాథమిక విచారణలో అభినయపై కత్తితో దాడి చేసిన అనంతరం ఆకాష్ ఉరేసుకున్నట్లు తేలింది.

# పాక్‌కు $800 మిలియన్ల ప్యాకేజీ..


- పాక్‌కు ఏడీబీ బ్యాంక్ $800 మిలియన్ల ప్యాకేజీ..
- నిధుల విడుదలపై అభ్యంతరం వ్యక్తం చేసిన భారత్..
- నిధులను ఉగ్రవాదం కోసం పాక్ వినియోగిస్తుందని భారత్ ఆరోపణలు..



**పాకిస్తాన్ :** పొరుగు దేశమైన పాకిస్తాన్ కు నిధులను విడుదల చేయడంపై భారతదేశం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తుంది. అయినప్పటికీ.. పాక్ కు గత నెలలో అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి ఒక బిలియన్ డాలర్ల (సుమారు రూ. 8,500 కోట్లు) ప్యాకేజీని రిలీజ్ చేసింది. ఈ నిధులను పాకిస్తాన్ ఉగ్రవాదం కోసం మళ్లీస్తుందని ఇండియా వాదిస్తున్నప్పటికీ తాజాగా, ఆసియా అభివృద్ధి బ్యాంకు కూడా పాక్ కు 800 మిలియన్ల డాలర్ల ప్యాకేజీని ఆమోదించింది.ఇక, ఆసియా అభివృద్ధి బ్యాంకు పాకిస్తాన్ కు ఆర్థిక సహాయం అందించడంపై భారతదేశం తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేసింది. 2018లో పాకిస్తాన్ జీడీపీలో 13 శాతంగా ఉన్న పన్ను ఆదాయం 2023లో కేవలం 9.2 శాతానికి గణనీయంగా తగ్గడంతో పాటు దాని రక్షణ వ్యయం పెరగడంతో పాక్ ఆర్థిక దుర్బలత్వానికి పాల్పడుతుందని భారత్ ఆరోపించింది. ఆసియా అభివృద్ధి బ్యాంక్, ఇతర అంతర్జాతీయ రుణదాతల నుంచి వచ్చే నిధులు అభివృద్ధికి బదులుగా సైనిక ఖర్చులకు పాక్ మళ్లిస్తుందని ఇండియా పేర్కొంది.

# దెబ్బతిన్నాం.. ఒప్పుకున్న బిలావల్ భుట్టో

- పహల్గామ్ ఉగ్రవాదుల దాడితో భారత్- పాక్ మధ్య ఉద్రిక్తతలు..
- అంతర్జాతీయ వేదికలపై పాకిస్తాన్ కు పరాజయాలు ఎదురవుతున్నాయి..
- భారత్ లో ముస్లింలను రాక్షసులుగా చూపిస్తున్నారు: బిలావల్ భుట్టో జర్దారీ



**పాకిస్తాన్ :** ఆపరేషన్ సిందూర్ పై భారత్ ఏర్పాటు చేసిన అఖిలపక్షం తరహాలోనే పాకిస్తాన్ కూడా పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) అధినేత బిలావల్ భుట్టో జర్దారీ నేతృత్వంలో ఒక పార్లమెంట్ సభ్యుల బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ బృందం అమెరికా పర్యటనలో భాగంగా.. ఐక్యరాజ్య సమితి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కాశ్మీర్ లో జరిగిన ఉగ్రవాద దాడిని భారతదేశంలోని ముస్లింలను రాక్షసులుగా చూపించడానికి ఒక రాజకీయ సాధనంగా ఉపయోగిస్తున్నారని బిలావల్ భుట్టో ఆరోపించారు.అయితే, అంతర్జాతీయ వేదికలపై తమ దేశానికి ఎదురవుతున్న పరాజయాలను పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ నేత బిలావల్ భుట్టో ఒప్పుకున్నారు. ముఖ్యంగా కాశ్మీర్ అంశాన్ని ఐక్యరాజ్యసమితిలో ప్రస్తావించేందుకు చేసిన అన్ని ప్రయత్నాలు ఆశించిన ఫలితాలను ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాశ్మీర్ అంశానికి సంబంధించిన సమస్యను ఇప్పటికి మనం ఎదుర్కుంటున్నామని తెలిపారు. దీంతో పాటు ఇతర వేదికలపైనా పాకిస్తాన్ కు ఎన్నో అవమానాలు తగిలాయని బిలావల్ భుట్టో పేర్కొన్నారు.ఇక, రెండు అణ్వస్త్ర దేశాలైన భారత్, పాకిస్తాన్ ల మధ్య వివాదాల పరిష్కారానికి ఒక వ్యవస్థను తీసుకురావడం అంత ఈజీ కాదని పీపీపీ అధినేత బిలావల్ భుట్టో చెప్పుకొచ్చారు. కానీ, టెర్రరిజంపై పోరులో మాత్రం.. మా రెండు దేశాలకు చెందిన నిఘా సంస్థలు ఐఎస్ ఐ, రా కలిసి కూర్చొని, ఈ ఉగ్రవాద శక్తులపై పోరాటం కోసం కలిసి పని చేస్తే, ఉగ్ర కార్యకలాపాలు తగ్గిపోతాయని అనుకుంటున్నాను.. లేదంటే, ఇరు దేశాల మధ్య నిరంతర ఘర్షణతో.. విద్రోహ శక్తులను మరింత బలోపేతం చేస్తుందని బిలావల్ భుట్టో ఆందోళన వ్యక్తం చేశారు.

# రంగంలోకి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి

- నిన్న ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో ఫుడ్ పాయిజన్ ఘటన
- ఎర్రగడ్డ మానసిక వైద్యశాలను సందర్శించిన ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- డైయిట్ కారణంగానే ఈ ఫుడ్ పాయిజాన్ జరిగినట్టు తెలుస్తోంది : మంత్రి దామోదర



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ అవతరణ దినోత్సవం రోజు ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో చోటుచేసుకున్న ఫుడ్ పాయిజన్ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. జూన్ 2న జరిగిన ఈ ఘటనపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నరసింహ స్పందించారు. మొత్తం 92 మంది రోగులు అస్వస్థతకు గురవగా, వారిలో 18 మందిని తీవ్రంగా ఉండటంతో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారిని గాంధీ ఆసుపత్రి, ఉస్మానియా సహా ఇతర ఆసుపత్రుల్లో ఏర్పాటు చేసిన ఆరు వైద్య బృందాలు పర్యవేక్షిస్తున్నాయి.ఈ ఘటనపై మంత్రి దామోదర రాజ నరసింహ మాట్లాడుతూ, ఫుడ్ పాయిజన్ కు కారణంగా ఆసుపత్రిలో అందించిన డైయట్ ఆహారమే అని ప్రాథమికంగా నిర్ధారణ అయినట్లు వెల్లడించారు. అదనంగా అందించిన స్వీట్ కూడా అనారోగ్యానికి కారణమైనట్లు అనుమానం వ్యక్తం చేశారు. ప్రస్తుతం బాధితుల ఆరోగ్యం మెరుగవుతోందనీ, ప్రాణాలకు ఎటువంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. వారు రెండు రోజుల్లో పూర్తిగా కోలుకుంటారని చెప్పారు.ఈ ఘటనకు కారణమైన డైయట్ ను పర్యవేక్షించే కాంట్రాక్టర్ పనితీరు సంతృప్తికరంగా లేనందున అతని కాంట్రాక్టును రద్దు చేసినట్టు మంత్రి తెలిపారు. ఇదే సమయంలో ఘటనపై సమగ్ర విచారణ కోసం ఒక ప్రత్యేక కమిటీని నియమించామని, కమిటీ నివేదిక వచ్చిన వెంటనే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయింది.ఇక ఫుడ్ పాయిజన్ కారణంగా మరణించిన వ్యక్తి కరణ్ కు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉన్నట్లు మంత్రి పేర్కొన్నారు. కరోనా వ్యాప్తి కోణంలో ఈ ఘటనపై ఆందోళన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# మెట్రోరైల్‌ను కీసర ఓఆర్ఆర్ వరకు విస్తరించాలి

- ఎంపీకి బీజేపీ నాయకుల వినతి



**సికింద్రాబాద్,ఫ్లాష్ ఇండియా :** తార్నాక నుంచి కీసర ఔటర్ రింగ్ రోడ్డు వరకు మెట్రో రైల్ ను విస్తరించాలని కోరుతూ కాప్రా సర్కిల్ బీజేపీ నాయకులు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. శివారు మండలాలు, గ్రామాలకు చెందిన వేలాది మంది ఈసీఐఎల్ చౌరస్తా, తార్నాక మీదుగా జంట నగరాలకు రాకపోకలు సాగిస్తుంటారని,ట్రాఫిక్ తిప్పలు తప్పించేందుకు మెట్రో రైలు ఒక్కటే పరిష్కారమని వారు ఎంపీకి విన్నవించుకున్నారు. ఎంపీనిన కలిసిన వారిలో బీజేపీ నాయకులు ఎం. గణేష్ ముదిరాజ్, డి. నాదం, ఎం.లక్ష్మణ్ గౌడ్, తాళ్ల ఆనంద్ గౌడ్, విద్యాసాగర్, అప్పినాయా, బొల్ల శ్రీనివాస్, రత్తపురం వెంకటేష్, పి.రాజు, రామకృష్ణ, జహంగీర్, సాయికిరణ్ తదితరులు ఉన్నారు.


# మరణించి మరొకరికి వెలుగు



**కనగల్లు ,ఫ్లాష్ ఇండియా :** కనగల్ పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న బొల్లెపల్లి సైదులు మంగళవారం డ్యూటీలో ఉండగానే రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కనగల్లు ఎస్సై పి.విష్ణు మృతుడి ఐ డొనేషన్ కోసం మానవతా దృక్పథంతో కుటుంబ సభ్యులను చైతన్య పరిచి నేత్ర దానానికి ఒప్పించారు. నేత్ర దానానికి ఒప్పుకున్న కుటుంబ సభ్యులు లయన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ చారిటబుల్ ట్రస్ట్ కి ఐ డొనేషన్ చేశాడు. నేత్రదానం ద్వారా ఇద్దరు కార్నియా అంధులకు వెలుగు చూపించారు. బాధలను కుటుంబ సభ్యుల త్యాగం మరువలేనిది అని లయన్స్ క్లబ్ సభ్యులు అన్నారు. 127వ కంటి దానంగా, 254 వ కార్నియా కంటి పొరల సేకరణలో సైదులు పేరు నమోదు అయినట్లు తెలిపారు.

# హైదరాబాద్‌లో చేప ప్రసాదం

- ఈనెల 8న చేప ప్రసాదం పంపిణీ
- ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి పొన్నం
- పంపిణీకి 1.5 లక్షల చేప పిల్లలు సిద్ధం



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ లో చేప ప్రసాదం పంపిణీ ముహూర్తం ఖరారైంది. ఈనెల 8వ తేదీన నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో చేప ప్రసాదం పంపిణీ చేయ నున్నారు. తాజాగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఏర్పాట్లను పరిశీలించారు. చేప ప్రసాదం పంపిణీకి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. చేప ప్రసాదం పంపిణీ పై ఫిషరీస్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయి కుమార్ కు పలు సూచనలు చేశారు.. చేప ప్రసాదం కోసం ఫిషరీస్ కార్పొరేషన్ 1.5 లక్షల చేప పిల్లలు సిద్ధం చేసింది.చేప ప్రసాదం పంపిణీలో భారీకెడ్లు, క్యూ లైన్ లో ఇబ్బందులు, భద్రత ఏర్పాట్లపై మంత్రి ఆరా తీశారు. పోలీసులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. చేప ప్రసాదం కోసం వచ్చే వారికి తాగునీరు ఏర్పాటు చేయాలని, వారికి భోజన వసతి కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థలకు కావలసిన ఏర్పాట్లు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఈ నెల 6 వ తేదీ నుంచే ఎగ్జిబిషన్ గ్రౌండ్ కి ఇతర రాష్ట్రాలకు చెందిన వారు వచ్చే అవకాశం ఉండటంతో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.

# కూకట్‌పల్లి డ్రగ్స్ కేసు..

## కానిస్టేబుల్ కోసం ముమ్మరంగా గాలింపు

- కూకట్‌పల్లి డ్రగ్స్ కేసులో కీలక నిందితుడు కానిస్టేబుల్ గుణశేఖర్ కోసం పోలీసులు గాలింపు కొనసాగుతోంది.
- గుణశేఖర్‌ను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు.



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** నగరంలోని కూకట్ పల్లి డ్రగ్స్ కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. పరారీలో ఉన్న కానిస్టేబుల్ గుణశేఖర్ తో పాటు మిగిలిన నిందితుల కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. తిరుపతి ఏఆర్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న గుణశేఖర్ డ్రగ్స్ కేసులో కీలక నిందితుడిగా ఉన్నాడు. గుణశేఖర్ ను పట్టుకునేందుకు ప్రత్యేకంగా పోలీస్ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈజీ మని కోసం డ్రగ్స్ దందాలో దిగినట్లు పోలీసులు గుర్తించారు. ఆరేళ్ల క్రితం కానిస్టేబుల్ గుణశేఖర్ తో సురేంద్రకు పరిచయం ఏర్పడినట్లు గుర్తించారు. ఇటీవల కావలికి చెందిన వేణు అనే తన స్నేహితుడికి మెర్సీ మార్గరెట్ వద్ద రూ.9.20 లక్షలు అప్పు ఇప్పించాడు సురేంద్ర.వేణు డబ్బు తిరిగి ఇవ్వక పోవడంతో సురేంద్రపై మెర్సీ ఒత్తిడి తెచ్చింది. దీంతో కానిస్టేబుల్ గుణశేఖర్ ను సురేంద్ర సహాయం అడిగాడు. తన వద్ద ఉన్న ఎపిడ్రిన్ డ్రగ్ విక్రయిస్తే కమిషన్ ఇస్తానని, అప్పుల బాధ నుంచి బయటపడవచ్చని కానిస్టేబుల్ గుణశేఖర్ ఆఫర్ ఇచ్చాడు. దీంతో డబ్బు వస్తుందనే ఆశతో డ్రగ్స్ విక్రయించేందుకు ఒప్పుకొన్నాడు. హరిబాబు అనే వ్యక్తి సహాయంతో డ్రగ్స్ విక్రయించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఇందులో భాగంగా బెంగళూరులో అప్పన్నకు ముందుగా 500 గ్రాముల ఎపిడ్రిన్ డ్రగ్ ను సురేంద్ర విక్రయించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. 20 రోజుల క్రితం అప్పన్నకు మదనపల్లి వద్ద సుమారు 500 గ్రాముల ఎపిడ్రిన్ డ్రగ్ ను అందజేశాడు.అనంతరం హైదరాబాద్ లో తమ వద్ద ఉన్న మిగిలిన డ్రగ్ ను విక్రయించేందుకు నిందితులు ప్లాన్ చేశారు. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం హైదరాబాద్ కు ఐదు మందితో కూడిన ముఠా వచ్చింది. హైదరాబాద్ లోని కూకట్ పల్లి ప్రాంతంలో ఓ గదిని అద్దెకు తీసుకుని అక్కడే ఉన్నారు. వీరంతా కలిసి గత ఆదివారం డ్రగ్స్ విక్రయించేందుకు ప్రయత్నించాలని.. ఆ రోజు పోలీసుల నిఘా ఉండదని భావించారు. అయితే కూకట్ పల్లి పోలీసులతో పాటు బాల్ నగర్ పోలీసులు వీరిపై నిఘా ఉంచి.. డ్రగ్స్ విక్రయిస్తుండగా అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి సుమారు 820 గ్రాముల ఎపిడ్రిన్ మిక్స్ డ్ డ్రగ్ ను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.కోటి వరకు ఉంటుందని తెలుస్తోంది. ఈ కేసులో కానిస్టేబుల్ గుణశేఖర్ కీలకంగా ఉన్నాడు.గుణశేఖర్ ను అరెస్ట్ చేస్తే కీలకమైన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. గుణశేఖర్ కు డ్రగ్స్ ఎక్కడి నుంచి వచ్చిందనే దానిపై ప్రధానంగా నిగ్గు తేలే అవకాశం ఉంది. పట్టుబడిన డ్రగ్స్ తో పాటు గుణశేఖర్ వద్ద ఇంకా డ్రగ్స్ ఉందా అనే అంశాలపై పోలీసుల విచారణలో బయటపడే అవకాశం ఉంది. ఈ క్రమంలో కానిస్టేబుల్ గుణశేఖర్ తో పాటు బెంగళూరుకు చెందిన అప్పన్న కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఒక బృందం బెంగళూరుకు వెళ్లగా, మరొక బృందం తిరుపతిలో గుణశేఖర్ కోసం గాలిస్తోంది.

# అర్హులందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇండ్లు



**ఖమ్మం ,ఫ్లాష్ ఇండియా :** అర్హులైన నిరుపేదలందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని, ఇది నిరంతర ప్రక్రియ అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. టి.సి.వి. రెడ్డి ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపాలిటీ ప్రాంత లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారుల ముఖాల్లో ఆనందం చూస్తుంటే తాను భావోద్వేగానికి లోనయ్యానని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే పని చేస్తే వారి నుంచి వచ్చే స్పందన అద్భుతంగా ఉంటుందని అన్నారు. గత పాలకులు ఎమ్మెల్యే నివాసాలు, ప్రభుత్వ భవనాల మీద పెట్టిన శ్రద్ధ పేద ప్రజల ఇండ్లపై పెట్ట లేదని, పేద ప్రజల సొంతింటి కలను విస్మరించిందని అన్నారు.రూ. 22 వేల 500 కోట్ల రూపాయలను పేద ప్రజల సొంతింటి కల కోసం ప్రజా ప్రభుత్వం ఈ సంవత్సరం కేటాయించిందని, ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ పేదల సంక్షేమం అజెండాగా పాలన కొనసాగిస్తున్నామని అన్నారు. గుడిసెలో ఉంటున్న నిరుపేదలకు మొదటి విడతలో ప్రభుత్వం ఇండ్లు మంజూరు చేస్తుందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం పారదర్శకంగా అమలు చేయాలని, ఎక్కడ లంచాలకు ఆస్కారం లేకుండా ప్రతి నియోజక వర్గానికి 3 వేల 500 ఇండ్లు మంజూరు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాజకీయాలకు అతీతంగా నిరుపేదలకు మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం పెట్టే ప్రతి రూపాయి పేదలకు ఉపయోగపడాలని తాము ప్రయత్నిస్తున్నా మని అన్నారు. 20 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు.గత పాలకులు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ పేద ప్రజలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా, ఆరోగ్యశ్రీ పరిమితి 10 లక్షలకు పెంపు, గురుకులాల్లో డైట్, కాస్మొటిక్ ఛార్జీలు పెంపు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. రైతులకు దాదాపు రూ. 21 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి రూ. 2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేశామని, సన్న వడ్లకు క్వింటాకు రూ. 500 రూపాయల బోనస్ అందించామని అన్నారు. రైతు భరోసా పథకం క్రింద పెట్టుబడి సహాయం ఎకరానికి రూ. 12 వేల రూపాయలకు పెంచామని అన్నారు.ప్రస్తుతం ప్రజలకు అందించే ఇండ్లు మొదటి విడత మాత్రమేనని, ప్రతి సంవత్సరం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు ఉంటుందని, ఏదులాపురం మున్సిపాలిటీ లో ప్రస్తుతం 520 మందికి ఇల్లులు మంజూరు చేసినట్లు, ఇంకా అర్హులున్నారని, వారికి కూడా ఇస్తామని, నిరంతర ప్రక్రియగా ఇందిరమ్మ ఇండ్ల పథకం కొనసాగుతుందని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్దిదారులు పలువురు మాట్లాడుతూ.... గత 10 సంవత్సరాల కాలంగా సొంతింటి కోసం అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ తమకు మంజూరు కాలేదని, ప్రజా ప్రభుత్వంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సహాయంతో తమకు ఇండ్లు మంజూరు కావడం సంతోషంగా ఉందని అన్నారు.

# ఇథనాల్ ఫ్యాక్టరీపై వ్యతిరేకత..

## ప్రజల్లో ఆగ్రహావేశం.. వాహనాలకు నిప్పు



**జోగులాంబ గద్వాల,ఫ్లాష్ ఇండియా :** జిల్లాలోని రాజోలి మండలంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. పెద్ద ధన్వాడ ప్రతిపాదిత ఇథనాల్ ఫ్యాక్టరీని వ్యతిరేకిస్తూ 12 గ్రామాల ప్రజలు ఈరోజు (బుధవారం) నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఇందుకు ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ క్రమంలో ఉదయం నుంచి పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎవ్వరినీ కూడా ఇథనాల్ కంపెనీ పరిసరాల్లోకి రానీయకుండా గట్టి భద్రతను కల్పించారు. అంతేకాకుండా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిని హౌజ్ అరెస్ట్ చేసి వారిని ఇంట్లో నుంచి బయటకు రానీయకుండా అడ్డుకున్నారు. దీంతో పరిస్థితి ఉగ్రరూపం దాల్చింది.శాంతియుతంగా నిరసన తెలిపేందుకు ప్రయత్నిస్తుంటే పోలీసులు అరెస్ట్ లు ఎలా చేస్తారంటూ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ ఉండే వాహనాలను బోర్లా వేయడంతో పాటు.. నిప్పు పెట్టారు. దీంతో అక్కడ అశాంతి వాతావరణం చోటు చేసుకుంది.

# జీహెచ్ఎంసీ బార్లకు దరఖాస్తుల వెల్లువ

- జీహెచ్ఎంసీ పరిధిలో 24 బార్లకు ఇప్పటికీ 356 దరఖాస్తులు
- రూరల్ బార్ల కంటే జీహెచ్ఎంసీలో ఎక్కువ స్పందన
- ఈ నెల 6వ తేదీ వరకు దరఖాస్తులకు చివరి గడువు

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** జీహెచ్ ఎంసీ పరిధిలోని 24 బార్లకు మిగిలిన మూడు రోజుల వ్యవధిలో భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ పీ. దశరథ్ తెలిపారు. నాంపల్లి కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. ఇటీవల రూరల్ ప్రాంతాల్లో బార్లకు అనూహ్యంగా అధిక దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు. మొత్తంగా జీహెచ్ ఎంసీతో కలిపి 28 బార్లకు పునరుద్ధరణ కోసం దరఖాస్తులను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు జీహెచ్ ఎంసీ పరిధిలోని 24 బార్లకు 356 దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు. రూరల్ బార్ల కంటే ఎక్కువగా జీహెచ్ ఎంసీలో దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.దరఖాస్తుల గడువు ఈ నెల 6వ తేదీ వరకూ ఉంటుందని స్పష్టం చేశారు. గత నెలలో రూరల్ పరిధిలో జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా 25 బార్లకు 1346 దరఖాస్తులు వచ్చాయని, ఈ దరఖాస్తుల ద్వారా ఎక్సైజ్ శాఖకు రూ.13.46 కోట్ల ఆదాయం లభించిందని చెప్పారు. మిగిలిన మూడు రోజుల్లో 3,000 నుండి 5,000 దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. జీహెచ్ ఎంసీ పరిధిలోని 24 బార్లతో పాటు, సరూర్ నగర్ , జాల్ పల్లి, మహబూబ్ నగర్ , నిజామాబాద్ , బోధన్ లో ఒక్కొక్క బార్ కు కూడా దరఖాస్తులను ఆహ్వానించినట్లు తెలిపారు.

# వృద్ధ రైతుపై చేయి చేసుకున్న ఏఎస్ఐ సస్పెండ్..

**నిర్మల్ ,ఫ్లాష్ఇండియా:** నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం పాత ఎల్లాపూర్ లో అమానుష ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు, భూభారతి సదస్సులో తన సమస్య చెప్పుకునేందుకు ఎమ్మార్వో ఆఫీసుకు వచ్చాడు. దీంతో ఓ ఏఎస్ఐ కనికరం లేకుండా దౌర్జన్యంగా రైతును ఎమ్మార్వో ఆఫీసు నుండి ఈడ్చుకెళ్లి పడేశాడు. అక్కడే ఉన్న పలువురు ఇదంతా వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అది కాస్త వైరల్ అయ్యింది. తాజాగా ఈ ఘటనపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు స్పందించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా హరీష్ రావు పోస్టు పెట్టారు.'సమస్య చెప్పుకునేందుకు తహశీల్దార్ కార్యాలయానికి వచ్చిన వృద్ధ రైతు పట్ల ఇంత కర్కశంగా వ్యవహరిస్తారా?. ఇదేనా మీరు చెబుతున్న ప్రజా పాలన. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఇంత అత్యుత్సాహం ప్రదర్శించడం పోలీసులకు అవసరమా?. నాడు లగచర్ల లంబాడి రైతన్నల చేతులకు బేడీలు వేశారు?.. నేడు ఖానాపూర్ లో వృద్ధ రైతు మెడలు పట్టి గెంటేశారు. ఎద్దేడ్చిన ఎవుసం, రైతేడ్చిన రాజ్యం బాగుపడదదు. ఈ సంగతి మరిచిపోయి ఇంత క్రూరంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ దుశ్చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం. రైతుపై చేయి వేసిన పోలీసుపై వెంటనే తెలంగాణ డీజీపీ చర్యలు తీసుకోవాలి. బేషరతుగా యావత్ తెలంగాణ రైతు లోకానికి కాంగ్రెస్ ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం' అని హరీష్ రావు ఎక్స్ లో పేర్కొన్నారు.మరోవైపు రైతుతో దురుసుగా ప్రవర్తించిన ఏఎస్ఐ రాంచందర్ ను సస్పెండ్ చేస్తున్నట్లు ఎస్పీ జానకీ ఉత్తర్వులు జారీ చేసింది.

# ఇంటర్ బోర్డు కీలక ప్రకటన...




**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** విద్యార్థులకు పుస్తకాల పంపిణీపై ఇంటర్ బోర్డు కీలక ప్రకటన చేసింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో చదువుతున్న విద్యార్థులకు 2025-26 విద్యా సంవత్సరానికి పాఠ్య పుస్తకాల ముద్రణ, పంపిణీ కార్యక్రమం ప్రారంభం అయిందని తెలిపింది. మొదటి సంవత్సర విద్యార్థులకు తెలుగు అకాడమీ ద్వారా పాఠ్య పుస్తకాల ముద్రణ పూర్తయిందని వెల్లడించింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు పుస్తకాల పంపిణీ ఇప్పటికే ప్రారంభం కాగా, 2025 జూన్ మొదటి వారంలో పంపిణీ పూర్తి అవుతుందని స్పష్టం చేసింది. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పుస్తకాల ముద్రణ తుది దశలో ఉందని పేర్కొంది. 2025 జూన్ మొదటి వారంలోపుగా ముద్రణ పూర్తవుతుందని.. 2024-25 సంవత్సరానికి వినియోగించగా మిగిలిన పుస్తకాలను అవసరమైన చోట్ల పంపిణీ చేస్తున్నామని తెలిపింది. జూన్ మధ్య నాటికి 100% పుస్తకాల పంపిణీ పూర్తి చేస్తామని.. విద్యార్థులకు సకాలంలో పుస్తకాలు అందుబాటులోకి వస్తాయని స్పష్టం చేసింది.కాగా.. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ కాలేజీలు సోమవారం తెరుచుకోనున్నాయి. ఈ ఏడాది నుంచి విద్యా సంవత్సరం సమయాల్లో ఇంటర్ బోర్డు మార్పులు తీసుకొచ్చింది. ప్రతి సంవత్సరం జూన్ 1 నుంచి విద్యా సంవత్సరం ప్రారంభమవుతుండగా ఈ ఏడాది ఏప్రిల్ 1నే ప్రారంభించారు. ఏప్రిల్ 1 నుంచి 23 వరకు తరగతులు నిర్వహించి, ఆపై వేసవి సెలవులు ఇచ్చారు. తిరిగి 2025-26 విద్యా సంవత్సరం పునఃప్రారంభం కానుంది. ఈ సంవత్సరం నుంచే కొత్తగా ఎంబైపీసీ చదివే అవకాశం విద్యార్థులకు కల్పించారు.


# టీజీ టెట్ ఎగ్జామ్ షెడ్యూల్ విడుదల

- తెలంగాణ టెట్-2025 షెడ్యూల్ విడుదల
- జూన్ 18 నుంచి 30 వరకు పరీక్షలు
- పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్ ) 2025 పరీక్షల షెడ్యూల్ ను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. ఈ పరీక్షలు జూన్ 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా రెండు షిఫ్ట్ ల్లో జరగనున్నాయి. పరీక్షలు రెండు పేపర్లుగా – పేపర్–1, పేపర్–2 విభజించబడ్డాయి. అభ్యర్థుల సౌలభ్యం కోసం జిల్లాల వారీగా పరీక్షల తేదీలు, సబ్జెక్టులు కేటాయించబడ్డాయి.పరీక్షలు ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ఒక షిఫ్ట్ , మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు మరో షిఫ్ట్ లో జరుగుతాయి. పేపర్–1ను రాయబోయే అభ్యర్థులు, ఐదో తరగతి వరకు బోధించాలనుకునే వారు కాగా, పేపర్–2ను రాయబోయే వారు ఆరో తరగతి పైగా బోధించాలనుకునే అభ్యర్థులు. పేపర్లు ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో ఉండగా, కొన్ని సబ్జెక్టులకు హిందీ, కన్నడ, తమిళం, ఉర్దూ, మరాఠీ, బెంగాలీ, సంస్కృతం మాధ్యమాలకూ అవకాశం కల్పించారు.జూన్ 18న ప్రారంభమయ్యే టెట్ పరీక్షలు మొదటగా మాథమెటిక్స్ & సైన్స్ (పేపర్–2) పరీక్షతో ప్రారంభమవుతాయి. వరుసగా 16 సెషన్లలో వివిధ సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహించనున్నారు. చివరి రోజైన జూన్ 30న మైనారిటీ భాషల్లో పేపర్–2 మాథమెటిక్స్, సైన్స్ & సోషల్ స్టడీస్ పరీక్షలు జరగనున్నాయి.ప్రతి జిల్లాలోని కేంద్రాలను స్పష్టంగా పేర్కొంటూ, సంబంధిత సబ్జెక్టుల పరీక్షలు ఏ తేదీన జరిగేలా కేటాయించారో విద్యార్థులకు వెల్లడించారు. నల్గొండ, ఖమ్మం, హైదరాబాద్, వరంగల్, సిరిసిల్ల, మంచిర్యాల, ములుగు, మహబూబ్ నగర్, మెదక్, నిజామాబాద్, జగిత్యాల, పటాన్ చెరు, సంగారెడ్డి వంటి జిల్లాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు షెడ్యూల్ లో తెలిపారు.ఈ షెడ్యూల్ ప్రకారం పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు తమ జిల్లాకు అనుగుణంగా తేదీలను గమనించి సన్నద్ధం కావాలని అధికారులు సూచించారు. త్వరలో హాల్ టికెట్లు విడుదల కానుండగా, అభ్యర్థులు అధికారిక వెబ్ సైట్ ద్వారా వాటిని డౌన్ లోడ్ చేసుకోవచ్చు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పాఠశాల విద్యాశాఖ పేర్కొంది.


# బ్యాగులో మహిళ మృతదేహం..

- బాచుపల్లి పియస్ పరిధిలో దారుణం
- బ్యాగులో గుర్తు తెలియని మహిళ మృతదేహం
- బ్యాగ్ నుంచి దుర్వాసన రావడంతో ఫిర్యాదు
- ఘటనా స్థలానికి చేరి పరిశీలించిన పోలీసులు
- దర్యాప్తు కోసం రంగంలోకి దిగిన ప్రత్యేక టీంలు



**మేడ్చల్,ఫ్లాష్ఇండియా:** మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా బాచుపల్లి పియస్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. విజయదుర్గ ఓనర్స్ అసోసియేషన్ కాలనీ నిర్మానుష్య ప్రాంతంలో బ్యాగులో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది.. బ్యాగ్ నుంచి దుర్వాసన వస్తుందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతురాలు వయసు 25 నుంచి 35 సంవత్సరాలు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. మెరూన్ కలర్ పంజాబీ డ్రెస్ తో ఉన్నట్లుగా పోలీసులు తెలిపారు. మృత దేహాన్ని గాంధీ హస్పెటల్ కు తరలించారు. బాలానగర్ జోన్ డీసీపీ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీంలు రంగంలోకి దిగాయి. మృతురాలి ఆచూకీ, హత్య చేసిన వారి వివరాల కోసం దర్యాప్తు చేపడుతున్నారు.

# కారు గెలిచాడు కానీ




**న్యూఢిల్లీ :** ఐపీఎల్ 2025లో రాజస్థాన్ రాయల్స్ జట్టు తరపున ఆడిన ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ అద్భుతమైన ప్రదర్శనతో అందరిని ఆకట్టుకున్నాడు. 14 ఏళ్ల వయస్సులోనే తన మొదటి ఐపీఎల్ సీజన్ లో తనదైన ముద్ర వేస్తూ గుర్తింపు పొందాడు. అతడు ఆడిన ఏడు మ్యాచ్ లలో 252 పరుగులు చేసి, స్ట్రైక్ రేట్ 206.55తో ప్రత్యర్థి బౌలర్స్ కు చుక్కలు చూపించాడు. ఈ అద్భుత ప్రదర్శనకు గుర్తింపుగా ఐపీఎల్ నిర్వాహకులు అతడికి సూపర్ స్ట్రైకర్ అఫ్ ది సీజన్ గా పేర్కొంటూ బహుమతిగా కారుని అందజేశారు.అయితే, ఇక్కడే అసలు ట్విస్ట్ ఉంది. అందేంటంటే.. కారు గెలిచినా, వైభవ్ మరో నాలుగేళ్ల పాటు దానిని డ్రైవ్ చేయలేడు. ఎందుకంటే, భారత దేశంలో ఆర్టీఏ రూల్స్ ప్రకారం డ్రైవింగ్ వయస్సు కనీసం 18 ఏళ్లు ఉండాలి. ఇప్పుడు వైభవ్ వయస్సు కేవలం 14 ఏళ్లు మాత్రమే కావడంతో అతడు కారు నడపడానికి ఇంకా నాలుగేళ్లు వేచి ఉండాల్సిందే. అయినప్పటికీ, అతి చిన్న వయసులోనే ఐపీఎల్ లో అతడు ఆడిన ఆటతీరు, సాధించిన రివార్డ్, అతని భవిష్యత్ పై భారీ ఆశలను పెంచుతున్నాయి. వైభవ్ కు ఇది ప్రారంభమే అంటూ, అతడి క్రికెట్ ప్రయాణంలో ముందు ముందు మరెన్నో మైలురాళ్లను దాటుతాడని సోషల్ మీడియాలో నెటిజన్స్ వ్యాఖ్యానిస్తున్నారు.


# ఈ విజయం ఆర్సీబి అభిమానులకు అంకితం






ఆర్సీబీ జట్టు ఐపీఎల్ 2025 ట్రోఫీని గెలుచుకున్న సమయంలో, అందరికన్నా ఎమోషనల్ గా స్పందించిన వ్యక్తి విరాట్ కోహ్లీ. ఈ గెలుపు 18 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు ముగింపు పలికింది. ఈ టైటిల్ అతడి జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోయే క్షణంగా నిలిచింది. కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకున్నప్పటికీ, కోహ్లీ ఆర్సీబీకి తన సేవలను అంకితం చేశాడు. ప్రతి మ్యాచ్ లో అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చి జట్టును ప్రేరేపించాడు.ఎంతోమంది లెజెండ్స్ ఆడిన ఈ జట్టుకు టోఫీ అందించడం యువ క్రికెటర్ల ద్వారా సాధ్యమైంది. కానీ, ఆ ట్రోఫీని ఎత్తి పట్టుకున్నప్పుడు కోహ్లీ కళ్లలలో వచ్చిన ఆనందానికి ఆర్సీబి అభిమానులు ఉప్పొంగిపోయారు. విజయాన్ని సెలబ్రేట్ చేసుకోవడంలో అతడి ఆనందం ఉక్కిరిబిక్కిరయ్యే భావోద్వేగానికి గురిచేసింది. అతడి దీర్ఘకాలం పాటు అందించిన కృషికి, నిబద్ధతకు ఇదే అసలైన ఫలితం. ఆర్సీబీ విజయ గాథలో విరాట్ పేరు చిరస్థాయిగా నిలవనుంది. ఇకపోతే ఏ విజయాన్ని అందుకున్న తర్వాత ఆయన సోషల్ మీడియా వేదికగా కూడా తన భావాలను వ్యక్త పరిచాడు.ఇందులో భాగంగా ఆయన.. ఈ జట్టే నా కలను నిజం చేసింది. ఈ సీజన్ ను నేను జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేను. గత రెండున్నర నెలలు మనమందరం చేసిన ప్రయాణం అద్భుతం. ఈ విజయాన్ని RCB అభిమానులకు అంకితంగా ఇస్తున్నాం. మనం ఓడినప్పుడు కూడా మన పక్కన నిలిచిన వారికీ, ప్రతి సంవత్సరం తలెత్తిన బాధ, నిరాశలన్నిటికీ ఇది సమాధానం. ఈ జెర్సీకి పేరుకుపోయిన ప్రతి అంగుళపు శ్రమకు ఇదే ఫలితం అంటూ కాస్త ఎమోషనల్ గా రాసుకొచ్చారు. అలాగే ఐపీఎల్ ట్రోఫీ విషయంలో మాట్లాడుతూ... నన్ను 18 ఏళ్లు ఆగేలా చేసావు.. కానీ, నిన్ను ఎత్తి పట్టుకుని ఉత్సవంగా మార్చిన ఈ క్షణం... ఎదురుచూపులన్నింటికీ న్యాయం చేసింది. ఈ విజయం కోసం ఎదురు చూసిన ప్రతి క్షణం విలువైనదే అంటూ రాసుకొచ్చారు.

# మళ్లీ నో చెప్పిన కేన్ విలియమ్సన్



న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు సెంట్రల్ కాంట్రాక్ట్ ను ఆ దేశ మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ మరోసారి తిరస్కరించాడు. ఫ్రాంచైజీ క్రికెట్ పై దృష్టిసారించిన విలియమ్సన్ గతేడాది కూడా సెంట్రల్ కాంట్రాక్ట్ వద్దనుకొన్నాడు. కానీ, గత సంవత్సరం తరహాలోనే క్యాజువల్ కాంట్రాక్ట్ పై అతడు సంతకం చేసే అవకాశా లున్నాయి. బోర్డు విడుదల చేసిన 20 మంది సెంట్రల్ కాంట్రాక్ట్ ప్లేయర్ల జాబితాలో కాన్వే, అలెన్ , సీఫెర్ట్ , ఫెర్గూసన్ పేర్లు కూడా లేవు. వీరంతా ప్రపంచవ్యాప్తంగా ఉన్న టీ20 లీగ్ లు ఆడుతున్న వారే. కాగా, మిడిల్ సెక్స్ తరఫున కౌంటీలు ఆడుతున్న విలియమ్సన్ .. ఆ తర్వాత 'ద హండ్రెడ్ 'లో బరిలోకి దిగనున్నాడు.

# ఒకుహారపై సింధు గెలుపు



ఇండోనేసియా ఓపెన్ సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ లో పీవీ సింధు, డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్ /చిరాగ్ శెట్టి శుభారంభం చేశారు. కాగా, వెటరన్ షట్లర్ హెచ్ ఎస్ ప్రణయ్ , మరో స్టార్ ఆటగాడు లక్ష్య సేన్ మాత్రం ఆరంభంలోనే ఇంటిబాట పట్టారు. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ లో సింధు 22-20, 21-23, 21-15తో చిరకాల ప్రత్యర్థి, జపాన్ స్టార్ నొజొమి ఒకుహారపై పోరాడి గెలిచింది. సింధు రెండోరౌండ్లో ఆరోసీడ్ పోర్న్ పవీ చోచువాంగ్ (థాయ్ లాండ్ )తో తలపడనుంది. డబుల్స్ మొదటి రౌండ్లో సాత్విక్ /చిరాగ్ జోడీ 18-21, 21-18, 21-14తో స్థానిక ద్వయం లియో రోలీ కర్నాడో/మౌలానాను ఓడించి ప్రీక్వార్టర్స్ లో ప్రవేశించింది. ఇక లక్ష్య సేన్ 11-21, 22-20, 15-21తో ప్రపంచ రెండో ర్యాంకర్ షి యు కి (చైనా) చేతిలో, ప్రణయ్ 17-21, 18-21తో స్థానిక షట్లర్ ఫర్హాన్ చేతిలో ఓటమి పాలయ్యారు.

# లెక్క సరిచేసిన గుకేష్





సహచరుడు అర్జున్ ఇరిగేసిపై బదులు తీర్చుకొన్న వరల్డ్ చాంపియన్ గుకేష్ .. నార్వే చెస్ టోర్నీలో ద్వితీయ స్థానానికి ఎగబాకాడు. 6వ రౌండ్ లో కార్ల్ సన్ పై గెలుపుతో బలంగా పుంజుకొన్న గుకేష్ .. 7వ రౌండ్ లో అర్జున్ పై గెలిచాడు. తెల్లపావులతో ఆడిన గుకేష్ 92 ఎత్తుల్లో అర్జున్ ఆట కట్టించాడు. 2వ రౌండ్ లో అర్జున్ చేతిలో గుకేష్ ఓడిన సంగతి తెలిసిందే. వరుసగా రెండో క్లాసిక్ గేమ్ లో నెగ్గిన గుకేష్ .. మొత్తం 7 రౌండ్ల నుంచి 11.5 పా యింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. కరువానా 12.5 పా యింట్లతో టాప్ లో ఉండగా.. కార్ల్ సన్ 11 పాయింట్లతో మూడో స్థానంలో, అర్జున్ 7.5 పాయింట్లతో ఆరో స్థానంలో కొనసాగుతున్నారు. మహిళల ఏడో రౌండ్ లో ముజిచెక్ తో క్లాసిక్ గేమ్ ను డ్రా చేసుకొన్న హంపి.. ఆర్మ్ గెడాన్ లో ఓటమి పాలైంది. కాగా, లీ టింగ్జీ చేతిలో వైశాలి క్లాసిక్ గేమ్ లోనే ఓడింది. 7 రౌండ్ల నుంచి హంపి 10.5 పాయింట్లతో మూడో స్థానంలో, వైశాలి 8 పాయింట్లతో ఐదో స్థానంలో ఉన్నారు.

# సెమీస్ కు సబలెంక స్వియటెక్



మహిళల డిఫెండింగ్ చాంపియన్ స్వియటెక్ , టాప్ సీడ్ సబలెంక ఫ్రెంచ్ ఓపెన్ లో సెమీఫైనల్ కు దూసుకెళ్లారు. మంగళవారం ఇక్కడ జరిగిన సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ఐదోసీడ్ స్వియటెక్ (పోలెండ్ ) 6-1, 7-5తో ఉక్రెయిన్ స్టార్ , 13వ సీడ్ స్విటోలినాను చిత్తుచేసింది. కెరీర్ లో ఆరో గ్రాండ్ స్లామ్ టైటిల్ పై గురిపెట్టిన 24 ఏళ్ల స్వియటెక్ కు ఈ వేదికపై వరుసగా ఇది 26వ విజయం. స్వియటెక్ తన కెరీర్ లో నెగ్గిన మొత్తం ఐదు గ్రాండ్ స్లామ్స్ లో నాలుగు ఇక్కడే అందుకోవడం విశేషం. క్లేకోర్టులో తిరుగులేని ఆటతీరుతో అదరగొడుతున్న స్వియటెక్ గురువారం జరిగే సెమీఫైనల్లో వరల్డ్ నెంబర్ వన్ సబలెంకతో అమీతుమీ తేల్చుకోనుంది. మరో క్వార్టర్ ఫైనల్లో సబలెంక (బెలారస్ ) 7-6 (3), 6-3తో చైనాకు చెందిన 8వ సీడ్ కిన్వెన్ జెంగ్ ను ఓడించింది. పురుషుల సింగిల్స్ లో 8వ సీడ్ లోరెంజొ ముసెట్టి (ఇటలీ) 6-2, 4-6, 7-5, 6-2తో అమెరికాకు చెందిన 15వ సీడ్ ఫ్రాన్సెస్ టియాఫోపై గెలిచి సెమీఫైనల్ కు చేరాడు.


# నీరజ్ క్లాసిక్ ఈవెంట్ 5న



'నీరజ్ చోప్రా క్లాసిక్ ' మొట్టమొదటి అంతర్జాతీయ జావెలిన్ త్రో ఈవెంట్ వచ్చేనెల 5న బెంగళూరులో జ ర గ నుంది. ఒలింపిక్ స్వర్ణ పతక విజేత, భారత స్టార్ నీరజ్ చోప్రా ఆధ్వర్యంలో జేఎస్ డబ్ల్యూ స్పోర్ట్స్ సహకారంతో అతని పేరుతోనే ఈ ఆరంభ ఈవెంట్ ను నిర్వహిస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం ఈ టోర్నీ గతనెల 24న జరగాల్సి ఉంది. అయితే, భారత్ -పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఈవెంట్ ను అప్పట్లో వాయిదా వేసిన సంగతి తెలిసిందే. ప్రపంచ వ్యాప్తంగా ఏడుగురు, భారత్ నుంచి ఐదుగురితో కలిపి మొత్తం 12 మంది జావెలిన్ త్రోయర్లు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొంటున్నారు.


# బిజినెస్

## పసిడి ధర పరుగులు..



పసిడి ధరలు పరుగులు పెడుతున్నాయి. రోజు రోజుకు మరింతపైకి ఎగబాకుతున్నాయి. నేడు తులంపై రూ. 200 పెరిగింది. హైదరాబాద్ లో ఈరోజు 24 క్యారెట్ల బంగారం ధర (1 గ్రాము) రూ.9,906, 22 క్యారెట్ల బంగారం ధర (1 గ్రాము) రూ.9,080 వద్ద ట్రేడ్ అవుతోంది. గోల్డ్ ధరలతో పాటు వెండి ధరలు కూడా స్వల్పంగా పెరిగాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్ లో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 200 పెరిగింది. దీంతో రూ. 90,800 వద్ద అమ్ముడవుతోంది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 220 పెరిగింది. దీంతో రూ. 99,060 వద్ద ట్రేడ్ అవుతోంది. విజయవాడ, విశాఖ పట్నంలో కూడా ఇదే ధరలు కొనసాగుతున్నాయి.దేశ రాజధాని ఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 200 పెరిగింది. దీంతో రూ. 90,950 వద్దకు చేరింది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 70 పెరిగింది. దీంతో రూ. 99,060 వద్ద ట్రేడ్ అవుతోంది. బంగారం ధరలు పరుగులు పెడుతుండగా వెండి ధరలు స్వల్పంగా పెరిగాయి. నేడు కిలో వెండిపై రూ. 100 పెరిగింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్ లో ఈ రోజు కిలో వెండి ధర రూ. 1,11,100 వద్ద అమ్ముడవుతోంది. ఢిల్లీలో కిలో సిల్వర్ ధర రూ. 1,00,100 వద్ద ట్రేడ్ అవుతోంది.

# ఊహల్లో గడిపే రోజులు పోయాయి..



ప్రస్తుతం ప్రపంచం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలోకి ప్రవేశించింది. ఒకప్పుడు మన ఊహలకు మాత్రమే పరిమితమైన ఎన్నో విషయాలు.. ఇప్పుడు మన కళ్లముందే వాస్తవంగా మారిపోతున్నాయి. ఒక చిన్న ఆలోచనైనా సరే, ఇప్పుడు ఏఐ ద్వారా వీడియోగా రూపుదిద్దుకుంటోంది. మనం చెప్పినట్టే సీన్లు, పాత్రలు, ప్రదేశాలు అన్నీ ఆకట్టుకునే విధంగా రూపొందిస్తున్నారు. ఇది కేవలం టెక్నాలజీ కాదు, కలలు నిజమయ్యే సాధనం గా మారుతోంది.ఈ క్రమంలోనే, 'స్టార్ బక్స్ ' వంటి ప్రముఖ కాఫీ షాప్ లో అందమైన రోబోలు పని చేస్తే ఎలా ఉంటుందనే ఆసక్తికరమైన వీడియోను ఏఐ ఆధారంగా రూపొందించారు. కస్టమర్లకు కాఫీ అందిస్తున్న రోబోలు, కౌంటర్ వద్ద హెల్ప్ చేస్తున్న స్మార్ట్ యంత్రాలు.. అన్నీ కలిసొచ్చేలా చూపించారు. ఇది కేవలం కల్పిత విజువల్ మాత్రమే అయినా, రాబోయే రోజుల్లో రోబోలు మానవుల దైనందిన జీవితంలో ఎంతటి భాగస్వామ్యం కావచ్చో చెబుతోంది. ఏఐ మానవ జీవనశైలిని మార్చే దిశగా ఎలా సాగుతోంది అనే దానికి ఇది మరో ఉదాహరణగా నిలిచింది. ప్రస్తుతం ఈ వీడియో నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది.

# భారత్‌లో పన్నుల భారం ఎక్కువ




భారత విమానయాన రంగం పై ప్రభుత్వం విఊధిస్తున్న పన్నులపై ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్ పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) ఆందోళన వ్యక్తం చేసింది. పన్నుల నిర్వచనంలోనూ స్పష్టత లేకుండా పోతోందని ఐఏటీఏ వార్షిక సదస్సుకు హాజరైన ఐఏటీఏ డైరెక్టర్ జనరల్ విల్లీ వాల్ష్ తెలిపారు. ఈ విషయంలో స్పష్టత ఏర్పడితే తప్ప భారత్ లో విమానయాన రంగం తన శక్తికి తగ్గట్టు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందే అవకాశం లేదని స్పష్టం చేశారు. భారత విమానాశ్రయాల్లో వసూలు చేస్తున్న చార్జీలపైనా వాల్ష్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచంలో మరే దేశంలోనూ భారత ఎయిర్ పోర్టుల్లో ఉన్నన్ని చార్జీలు లేవన్నారు. ఈ చార్జీలు విమానయాన సంస్థలకు భారం కాని స్థాయిలో ఉండాలన్నారు. ఇన్ని సమస్యలు ఉన్నా భారత్ లో విమానయాన రంగం వేగంగా విస్తరిస్తోందన్నారు. ఈ విషయంలో భారత్ త్వరలోనే చైనాను మించిపోతుందని వాల్ష్ స్పష్టం చేశారు.

**అద్భుత అవకాశాలు: వర్జిన్ అట్లాంటిక్**

విమానయానానికి సంబంధించి భారత్ అద్భుత అవకాశాల గని అని బ్రిటన్ కేంద్రంగా పనిచేసే వర్జిన్ అట్లాంటిక్ విమానయాన సంస్థ తెలిపింది. భారత-బ్రిటన్ ఎఫ్ టీఏ నేపథ్యంలో సరుకు రవాణ కోసం భారత్ కు మరిన్ని విమాన సర్వీసు ప్రారంభించబోతున్నట్టు ఆ సంస్థ సీఈఓ షాయ్ వీస్ చెప్పారు. అమెరికా తర్వాత ప్రస్తుతం భారత్ తమకు అతిపెద్ద మార్కెట్ అన్నారు.భారత్ నుంచి ప్రస్తుతం ఏటా తమ విమానాల ద్వారా 10 లక్షల మంది ప్రయాణిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. తన సాంకేతిక వ్యవస్థలను ఏఐ ఆధారిత సొల్యూషన్స్ తో ఆధునీకరించేందుకు వర్జిన్ అట్లాంటిక్ సంస్థ టీసీఎస్ తో ఐఏటీఏ సదస్సు సందర్భంగా ఒక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్య ఒప్పందం ఏడేళ్ల పాటు అమల్లో ఉంటుంది.

# వికసిత్ భారత్ కావాలంటే 8-9 శాతం వృద్ధి అవసరం



2047 నాటికి భారత్ వికసిత దేశంగా మారాలనుకుంటే, 8, 8.5 నుంచి 9 శాతం వృద్ధి అవసరమని ఆర్ బీఐ మాజీ గవర్నర్, ఆర్థికవేత రఘురామ్ రాజన్ తెలిపారు. అందుకు కారణంగా మనది ఇప్పటికీ పేద దేశమేనని అన్నారు. మంగళవారం జాతీయ మీడియాకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన.. అనేక అంశాల కారణంగా ప్రపంచ ఆర్థికవ్యవస్థ అనిశ్చితిని ఎదుర్కొంటోంది. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ భారత్ బలమైన జీడీపీ గణాంకాలను నమోదు చేస్తోంది. గత ఆర్థిక సంవత్సరం నాల్గవ త్రైమాసికంలో భారత జీడీపీ 7.4 శాతంగా ఉంది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి 6.5 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఈ గణాంకాలు అనేక దేశాల ఆర్థికవ్యవస్థల కంటే చాలా ఎక్కువ. ప్రస్తుత ఈ వృద్ధి చాలా ముఖ్యమైనదే, కానీ ఎన్నికల వల్ల ప్రభుత్వ వ్యయానికి అవాంతరాలు ఎదురవడం, ఇతర గణాంకాల్లో ఒడిదుడుకులు ఉండటం వల్ల ఇది సరిపోదు. ఇంకా చాలా సాధించాల్సి ఉంది. పెట్టుబడులు వచ్చేందుకు మరిన్ని చర్యలు, వినియోగం పెంచే నిర్ణయాలు, దేశీయ-విదేశీ వ్యాపారాలు భారత్ వైపు చూసే ధోరణిని కొనసాగించే ప్రయత్నాలు, అధిక వృద్ధిని కొనసాగించే వ్యూహం అవసరమని ఆయన వెల్లడించారు.

**జపాన్ ను అధిగమించడంతో అయిపోలేదు**

భారత జీడీపీ జపాన్ ను దాటి నాల్గవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించడంపై స్పందించిన రఘురామ్ రాజన్, ఈ మైలురాయిని అందుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. కానీ మరింత స్థిరమైన లక్ష్యాలు ఏర్పరచుకోవాలని అన్నారు. ఇతర దేశాలను దాటి అతిపెద్ద జీడీపీ దేశంగా మారుతుండం గర్వంగా ఉంది, రాబోయే సంవత్సరాలలో జర్మనీని కూడా దాటగలం. బహుశా మరో 1-2 ఏళ్లలో ఇది సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. ఇదే సమయంలో జీడీపీ ర్యాంకింగ్ లను నిజమైన ఆర్థిక పురోగతిగా భావించవద్దని ఆయన హెచ్చరించారు. మారకపు రేటు ఈ హెచ్చుతగ్గులను ప్రభావితం చేస్తాయి. జపనీస్ యెన్ బలంగా ఉంది. ఈ అంశాన్ని తేలిగ్గా తీసుకోవడానికి లేదు. మనం ఈ దేశాల కంటే చాలా పేదవాళ్ళం. సగటు పౌరుడికి మనం ఎంత ధనవంతులు అనేది ముఖ్యం, జీడీపీ గణాంకాల హెచ్చుతగ్గులు కాదు. ఎందుకంటే మనం ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశం. కాబట్టి సామాన్య పౌరుడు పేదవాడిగా ఉన్నా సరే, మొత్తం జీడీపీ ఎక్కువగా ఉంటుంది.

# ఇలాంటి కథలో నటించడం



టాలీవుడ్ లో అనతి కాలంలోనే మంచి గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ రీతూ వర్మ. రీసెంట్ గా 'మజాకా' మూవీతో మంచి హిట్ అందుకున్న ఈ అమ్మడు ప్రజంట్ 'దేవిక అండ్ దానీ' అనే వెబ్ సిరీస్ తో రాబోతుంది. ఇది ఆమె నటించిన తొలి వెబ్ సిరీస్. దర్శకుడు బి.కిశోర్ రూపొందించగా, సుధాకర్ చాగంటి నిర్మాతగా వ్యవహరించారు. సూర్య వశిష్ట, శివ కందుకూరి, సుబ్బరాజు తదితరులు ముఖ్య పాత్రలు పోషించిన ఈ వెజిసిరీస్, ఈ నెల 6న ప్రముఖ ఓటీటీ వేదిక జియో హాట్ స్టార్ లో విడుదల కానుంది. ఈ క్రమంలో తాజాగా మీడియా సమావేశం అయ్యారు మూవీ టీం.. ఈ సందర్భంగా రీతూ వర్మ మాట్లాడుతూ.. 'ఇలాంటి కాన్సెప్ట్ తో సిరీస్ చేయాలని నేనెప్పటి నుంచో అనుకుంటున్నా. ఈ క్రమంలోనే 'దేవిక అండ్ డానీ' లాంటి నిజాయితీతో కూడిన కథ నా దగ్గరకు వచ్చింది. ఇందులో నటించడం నా అదృష్టంగా భావిస్తున్నా. దర్శకుడు కిశోర్ దీన్ని అద్భుతంగా తెరకెక్కించారు. సాధారణంగా ఊర్లో ఉండే అమ్మాయిల్ని.. ఈ పని చేయి, ఆ పని చేయకని ఆంక్షలు పెడుతుంటారు. అలాంటి వాళ్ళు బయటకు వెళ్తే ఎలా మారతారనే విషయాన్ని ఈ సిరీస్ ల్లో చక్కగా చూపించారు. చాలా మంది అమ్మాయిలను చుట్టు పక్కల ఉండేవాళ్లు.. నువ్వు ఏం చేయలేవు. సాధించలేవు అని నిరుత్సాహ పరుస్తున్నారు. అలాంటి అమ్మాయిలకు ఈ 'దేవిక అండ్ దానీ' వెబ్ సిరీస్ ఓ నమ్మకాన్ని ఇస్తుంది' అని రీతూ తెలిపింది.

# అంతే అదే క్లూ..





మల్టీ టాలెంటెడ్ గా తనకంటూ స్పెషల్ గుర్తింపు తెచ్చుకున్న రాఘవా లారెన్స్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'BENZ'. స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా నుంచి.. ఫస్ట్ లుక్ పోస్టర్స్ తప్ప మరో అప్ డేట్ రాలేదు. దీంతో ఈ సినిమా నుంచి వచ్చే అప్ డేట్స్ కోసం లారెన్స్ ఫ్యాన్స్ ఎంతో ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు. ఇందులో భాగంగానే రీసెంట్ గా ఫేమస్ నటుడు నివిన్ పౌలీ నటిస్తున్నట్లు తెలిపారు. అలాగే తాజాగా మరో ఇంట్రెస్టింగ్ అప్ డేట్ ఇచ్చాడు లారెన్స్. 'నువ్వు దీనికి సిద్ధంగా లేవు.. అంతే అదే క్లూ.. అంటూ ఇంట్రెస్టింగ్ ట్వీట్ పెట్టాడు లారెన్స్. ప్రజెంట్ దీనికి సంబంధించిన పోస్టర్ వైరల్ కావడంతో.. ఫ్యాన్స్ ఎంతో సంబరపడుతున్నారు.

# మళ్లీ ఫామ్‌లోకి



పలు అనారోగ్య కారణాలతో సినిమాలకు కాస్త బ్రేక్ ఇచ్చిన టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత.. ఇప్పుడిప్పుడే మళ్లీ ఫామ్ లోకి వచ్చింది. వరుస ప్రాజెక్టులతో బిజీగా మారిపోయింది. వరుస పెట్టి సినిమాలు, వెబ్ సిరీస్ లు చేస్తోంది. నిర్మాతగా మారి 'శుభం' మూవీ తో వచ్చిన ఈ అమ్మడు మొదటి చిత్రం తో మంచి హిట్ అందుకుంది. ప్రస్తుతం 'మా ఇంటి బంగారం' అనే మూవీ చేస్తోంది. అలాగే నెట్ ఫ్లిక్స్ లో 'రక్త్ బ్రహ్మండ్ ' అనే ప్రాజెక్ట్ లోనూ భాగమైంది. అయితే ఈ మధ్య సామ్ మూవీస్ పరంగా మాత్రమే కాకుండా.. ఎక్కువగా ఈవెంట్స్ లో పాల్గొంటూ సందడి చేస్తోంది.ఇందులో భాగంగా తాజాగా సమంత దుబాయ్ లో జరిగిన ఓ స్పెషల్ ఈవెంట్ కు చాలా స్పెషల్ గా ముస్తాబై వచ్చింది. ఎంబ్రాయిడరీ నెట్ గోల్డ్ కలర్ శారీలో మెరిసిపోయింది. సింపుల్ మేకప్ , హెయి స్టైల్ తో తన లుక్ కు మరింత అందంగా మార్చుకని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సామ్ ను చూసేందుకు అభిమానులు పోటీ పడ్డారు. వారందరితో సమంత ఫోటోలు, సెల్ఫీలకు ఫోజులిచ్చింది. ఇందుకు సంబంధించిన ఫోటోలను సామ్ తన ఇన్ స్టా వేదికగా అభిమానులతో పంచుకుంది. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట తెగ ఆకట్టుకుంటున్నాయి. మొన్నటి వరకు జనాలోకి రావడానికి ఇబ్బంది పడిన సామ్ ఇలా అందరితో కలిసి పోతుంటే ఆమె అభిమానులు 'సామ్ ఎప్పటికీ ఇలాగే నవ్వుతూ ఉండాలి' అంటూ కామెంట్ లు పెడుతున్నారు.

# హరిహర వీరమల్లు వాయిదా లాంఛనమే!




ఇక తమ నిరీక్షణకు తెరపడే సమయం రానే వచ్చేసిందని సంబరపడిపోయారు పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్. ఏది ఏమైనా జూన్ 12న 'హరిహర వీరమల్లు' రిలీజ్ అవుద్దని అనుకున్నారు. కానీ ఇప్పుడు మరోసారి ఈ సినిమా వాయిదా లాంఛనమే అని తెలుస్తోంది. మేకర్స్ నుంచి ఇంకా కన్ఫర్మేషన్ రాలేదు కానీ.. ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్స్ మాత్రం వీరమల్లు వాయిదాను కన్ఫామ్ చేశారు. ఈ సినిమా పోస్ట్ పోన్ అవడానికి బిజినెస్ అవలేదంటూ ఏదేదో ప్రచారం జరుగుతోంది. అయితే విఎఫ్ ఎక్స్ వర్క్ డిలే కారణంగా ఈ సినిమాను వాయిదా వేస్తున్నట్టుగా తెలిసింది.హరిహర వీరమల్లు ట్రైలర్ ను సినిమా రిలీజ్ కు రెండు వారాల ముందు రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారట. ధనుష్ నటించిన 'కుబేర' సినిమాతో వీరమల్లు ట్రైలర్ ఎటాచ్ చేయనున్నారట. ఈ లెక్కన జూలై 4 లేదా 11న హరిహర వీరమల్లు రిలీజ్ అయ్యే ఛాన్స్ ఉంది. ఇక సినిమా వాయిదా పడిన నేపథ్యంలో.. ఈ నెల 8న తిరుపతిలోని ఎస్వీయూ తారకరామా క్రీడా మైదానంలో జరగాల్సిన ప్రీ రిలీజ్ ఈవెంట్ కూడా వాయిదా వేస్తున్నట్టుగా నిర్వాహకులు తెలిపారు. మొత్తంగా హరిహర వీరమల్లు పోస్ట్ పోన్ అయినట్టే. కాకపోతే.. మేకర్స్ నుంచి కొత్త రిలీజ్ డేట్ పై క్లారిటీ రావాల్సి ఉంది.అయితే హరిహర వీరమల్లు విషయంలో ఇది కొత్త కాదు. ఇప్పటికే చాలాసార్లు ఈ సినిమా వాయిదా పడుతూ వస్తోంది. ఇప్పుడు మరోసారి కూడా అదే జరుగుతోంది. నిన్న మొన్నటి వరకు ఈ సినిమా పవన్ కళ్యాణ్ వల్ల డిలే అవుతూ వచ్చిందని అన్నారు. కానీ ఇప్పుడు షూటింగ్ మొత్తం కంప్లీట్ అయినా.. విఎఫ్ ఎక్స్ వర్క్ అనుకున్న సమయానికి పూర్తి కాలేదని అంటున్నారు. మరి ఐదేళ్ల నుంచి మేకర్స్ ఏం చేశారనేదే? ఇక్కడ అంతుబట్టకుండా ఉంది.

# అక్షయ్ నుంచి చిట్కాలు తీసుకోవాలి..



స్టార్ హీరో అక్షయ్ కుమార్ ప్రజెంట్ వరుస చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతున్నాడు. ఆయన నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'హౌస్ ఫుల్ 5'. ఫుల్ కామెడీ థ్రిల్లర్ చిత్రంగా తెరకెక్కుతోన్న ఈ మూవీకి తరుణ్ మన్సుఖాని దర్శకత్వం వహిస్తున్నాడు. నాడియాద్వాలా గ్రాండ్ సన్ ఎంటర్ టైన్మెంట్ ప్రొడక్షన్ బ్యానర్ పై సాజిద్ నడియాద్వాలా, వార్దా నదియాద్వాలా అండ్ ఫిరూజీ ఖాన్ నిర్మిస్తున్నారు. ఇందులో అక్షయ్ కుమార్ తో పాటు రితేష్ దేశ్ ముఖ్, అభిషేక్ బచ్చన్, సంజయ్ దత్, ఫర్దీన్ ఖాన్, నానాపటేకర్, జాకీష్రాఫ్, జాక్వెలిన్ ఫెర్నాండెజ్ తదితరులు ప్రధాన పాత్రలో నటిస్తున్నారు.ఈ మూవీ భారీ అంచనాల మధ్య జూన్ 6న థియేటర్స్ లో గ్రాండ్ రలీజ్ కు సిద్ధం అవుతోంది. దీంతో ప్రమోషన్స్ లో జోరు పెంచారు చిత్ర బృందం. ఇందులో భాగంగానే జాక్వెలిన్ ఫెర్నాండెజ్ తన టీమ్ తో ఎంజాయ్ చేస్తున్న వీడియో షేర్ చేస్తూ.. 'అక్షయ్ కుమార్ ను చూసి నా డ్యాన్స్ ను నేను మెరుగుపరచుకోవాలి.. దీని కోసం ఆయన నుంచి కొన్ని చిట్కాలు పొందాలి.. హౌస్ ఫుల్ 5 వచ్చేస్తుంది.. మీరు కూడా చూసి నేర్చుకోండి' అంటూ ఓ వీడియో షేర్ చేసింది.

# జాక్ సినిమాకు నష్టాలు..




తెలుగు సినిమా ఇండస్ట్రీలో సుదీర్ఘకాలంగా ఉన్నప్పటికి గుంటూరు టాకీస్, డీజే టిల్లు సినిమాలతో సిద్ధు జోన్నలగడ్డకు హీరోగా మంచి క్రేజ్ వచ్చింది. ఈ క్రమంలోనే టిల్లు స్క్వేర్ తీయగా భారీ విజయం సాధించి.. నిర్మాతలకు లాభాలు తెచ్చిపెట్టింది. అయితే అదే ఊపులో "జాక్" అనే సినిమాను తీసి విడుదల చేయగా.. ఆ సినిమా ఊహించిన స్థాయిలో రాణించలేకపోయింది. ముఖ్యంగా పోటీ ఎక్కువగా ఉండటం, ఫ్లాప్ టాక్ సొంతం చేసుకోవడంతో కనీస కలెక్షన్లు కూడా జాక్ సినిమా రాబట్టలేకపోయిన విషయం తెలిసిందే. అయితే తాను హీరోగా నటించిన జాక్ సినిమా కు భారీ నష్టాలు రావడంతో హీరో సిద్దు సంచలన నిర్ణయం తీసుకున్నారు.జాక్ సినిమాకు తాను తీసుకున్న పారితోషికం రూ.4.75 కోట్లలో సగం నిర్మాతకు తిరిగి ఇచ్చాడు. ఈ విషయాన్ని బీవీ రాజు టీమ్ అఫీషియల్ గా ప్రకటించింది. నష్టాల్లో ఉన్న నిర్మాణ సంస్థను ఆదుకునేందుకు యంగ్ హీరో తీసుకున్న నిర్ణయంపై ప్రశంసలు కురిపిస్తున్నారు. సిద్దు నిర్ణయం ఎందరో యువ హీరోలకు, ప్రొడ్యూసర్లకు ప్రేరణగా నిలుస్తుందని, ఈ నిర్ణయం ఆయన తర్వాత సినిమాలపై సానుకూల ప్రభావం చూపుతాయని, నిర్మాత ధైర్యంగా సినిమాలు తీసే వాతావరణం నెలకొంటుందని కామెంట్లు చేస్తున్నారు. కాగా సిద్దు ప్రస్తుతం తెలుసు కదా అనే సినిమాలో నటిస్తున్నారు. ఈ సినిమా అక్టోబర్ 17న విడుదల కానుంది.

# 'నా సామిరంగ' బ్యూటీ..



స్టార్ హీరో రవితేజ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'మాస్ జాతర'. భాను భోగవరపు అనే కొత్త దర్శకుడు తెరకెక్కిస్తున్న ఈ చిత్రం సమ్మర్ కానుకగా విడుదల కానుందట. ఇక దీంతర్వాత రవితేజ డైరెక్టర్ కిషోర్ తిరుమలతో ఓ మూవీ కమిట్ అయ్యారు. అయితే ఇటీవల 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా బ్లాక్ బస్టర్ సక్సెస్ సాధించడంతో, ఇప్పుడు మన టాలీవుడ్ దర్శక రచయితలు అదే జోనర్ లో సినిమాలు చేయాలని ట్రై చేస్తున్నారట. ఫ్యామిలీ ఆడియన్స్ ను ఆకట్టుకునే కథలు రాసుకుంటున్నారని తెలుస్తోంది. ఈ క్రమంలో హీరో రవితేజకు కిషోర్ తిరుమల కూడా ఇలాంటి ఫ్యామిలి స్టోరినే వినిపించాడట..ఈ సినిమా షూటింగ్ ను జూన్ నెలలో ప్రారంభించేందుకు చిత్ర యూనిట్ సిద్ధమవుతుంది. దీంతో ఈ మూవీ కోసం హీరోయిన్ ల వేట మొదలెట్టారు టీమ్.. ఇప్పటికే కేతికా శర్మను సెలెక్ట్ చేయ గా, ఇప్పుడు ఈ సినిమాలో మరో బ్యూటీ కూడా నటిస్తుందని తెలుస్తోంది. కాగా ఈ సినిమాలో రెండో హీరోయిన్ గా ఆషికా రంగనాథ్ నటించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. కన్నడ బ్యూటీ అయినప్పటికి.. 'నా సామిరంగ' తో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చి, మొదటి మూవీతోనే తన అందం నటనతో తెలుగు ప్రేక్షకులను కట్టిపడేసింది. ప్రస్తుతం 'విశ్వంభర' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక ఇప్పుడు మాస్ రాజా రవితేజతో రొమాన్స్ కు రెడీ అయింది. ఇక దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో రానుంది.

# ఏకంగా ఏడు భాషల్లో




ఒక్కప్పుడు టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా చక్రం తిప్పిన ప్రియమణి.. ప్రజెంట్ రీ ఎంట్రీ ఇచ్చి సిల్వర్ స్క్రీన్, స్మాల్ స్క్రీన్, డిజిటల్ స్క్రీన్ అని తేడాలు చూడడం లేదు. తనకు నచ్చిన కథలు ఎక్కడ లభిస్తే అక్కడ యాక్ట్ చేస్తుపోతుంది. రీసెంట్ గా 'ది ఫ్యామిలీ మ్యాన్' సీజన్ ఆమెకు మంచి గుర్తింపు తెచ్చి పెట్టగా.. తాజాగా 'గుడ్ వైఫ్' అనే వెబ్ సిరిస్ తో రాబోతుంది ప్రియమణి. అమెరికన్ వెబ్ సిరీస్ 'ది గుడ్ వైఫ్' ఆధారంగా ఈ వెబ్ సిరీస్ రూపొందినట్లు సమాచారం.సెక్స్ కుంభ కోణంలో చిక్కుకున్న త న భ ర్త ను ర క్షించేందుకు ఓ మాజీ లాయ ర్ చేసిన పోరాటం నేప థ్యంలో అదిరిపోయే థ్రిల్లింగ్ , ఎమోష న ల్ డ్రామాగా ఉండ నుంది. త్వరలో ఈ సిరీస్ స్ట్రీమింగ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. తాజాగా ఈ సిరీస్ కు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. కాగా ఈ మూవీలో ప్రియమణి లుక్ చాలా డిఫరెంట్ గా ఉంది. సాధారణంగా పాన్ ఇండియా రిలీజ్ అంటే హిందీతో పాటు దక్షిణాది భాషలైన తెలుగు, తమిళ, కన్నడ, మలయాళంలో ఇలా విడుదల చేస్తూ వస్తున్నారు. కానీ ఇప్పుడు ఈ సిరీస్ రిలీజ్ అంతకు మించి అని చెప్పాలి. హిందీ, తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ భాషలతో పాటు మరాఠీ, బెంగాలీ లో కూడా సిరీస్ స్ట్రీమింగ్ చేయనున్నట్లు జియో హాట్ స్టార్ ఓటీటీ పేర్కొంది.

# రిలీజ్ పై క్లారిటీ ఇచ్చిన మేకర్స్..!




రౌడీ హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'కింగ్డమ్'. వరుస డిజాస్టర్ల తర్వాత విజయ్ నుంచి రాబోతున్న ఈ చిత్రం సితార ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ , ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 'జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో అందాల భామ భాగ్యశ్రీ బొర్సె హీరోయిన్ గా నటిస్తుండగా అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు. అయితే ఈ చిత్రం మే 30నే రిలీజ్ కావాల్సి ఉండగా వివిధ కారణాలతో జులై 4కి వాయిదా పడింది. ఈ విషయాన్ని మేకర్స్ ఇటీవలే అఫీషియల్ గా ప్రకటించారు.. అయినప్పటికీ రిలీజ్ విషయంలో పలు వార్తలు చక్కర్లు కొడుతూ నే ఉన్నాయి. ఈ సినిమాకు సంబంధించిన కొన్ని సీన్లు రీ షూట్ చేస్తున్నారన్ని.. ఫైనల్ కట్ చూసిన తర్వాత డైరెక్టర్ గౌతమ్ కాస్త అసంతృప్తిగా ఫీలయ్యాడని.. అందువల్ల కొన్ని కీలక సన్నివేశాలను మళ్లీ షూట్ చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో 'కింగ్డమ్' మేకర్స్ ఈ వార్తలకు చెక్ పెట్టారు. 'మా సినిమా ఎలాంటి రీషూట్ జరుపుకోవడం లేదు.ఎలాంటి వాయిదాలు వేయడం లేదు. మా సినిమా అనుకున్న డేట్ కు అనుకున్నట్లుగానే సాలిడ్ గా వస్తుంది.. కాకాపోతే తుఫాను వచ్చే ముందు నిశ్శబ్దం ఇలాగే ఉంటుంది' అని వారు పేర్కొన్నారు. మొత్తానికి క్లారిటీ అయితే ఇచ్చారు. ఇక విజయ్ దేవరకొండ కి చాలాకాలంగా భారీ హిట్ కోసం చూస్తున్నాడు. 'డియర్ కామ్రేడ్', 'వరల్డ్ ఫేమస్ లవర్', 'లైగర్', 'ఫ్యామిలీ స్టార్' వంటి బ్యాక్ బ్యాక్ చిత్రాలు తీసిన అని డిజాస్టర్ కాగా.. 'ఖుషీ' కాస్త పర్వాలేదనిపించింది. దీంతో విజయ్ దేవరకొండ 'కింగ్ డమ్'పై చాలా ఆశలే పెట్టుకున్నాడు. మరి ఎలాంటి రిజల్ట్ వస్తుందో చూడాలి..

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**